1st Happy Work Anniversary. 1 Year

షణ్ముఖ
SHANMUKHAVELUGU
# వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక

RNI : APTEL / 2023 / 89152

Good for Health
Best for Readers

సంపుటి : 03 సంచిక : 174
బుధవారం 01 జూలై 2026 పేజీలు 8 వెల : రూ.3

Printed by Ongole. Published From Ongle, Nellore, Guntur, Markapur, Bapatla.

## సింధూ జలాల్లో చుక్క నీరు కూడా మోదీ వదలట్లేదు: పాక్ అక్కసు



(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ, జూన్ 30)

సింధూ జలాల ఒప్పందాన్ని భారత్ పక్కనబెట్టడంతో పాకిస్థాన్ ఉక్కిరిబిక్కిరవుతోంది. ఈ ఒప్పందం విషయంలో యుద్ధానికైనా సిద్ధమేనంటూ ఇటీవల కవ్వింపులకు పాల్పడిన దాయాది.. తాజాగా మరోసారి భారత్‌పై ప్రేలాపనలు చేసింది. సింధూ జలాల్లో తమ వాటా తీసుకొంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందంటూ పాక్ మంత్రి ముసాదిక్ మాలిక్ వ్యాఖ్యలు చేశారు. "సింధూ జలాల నియంత్రణకు భారత్ యత్నిస్తోంది. పాక్‌లోకి చుక్క నీరు కూడా ప్రవహించకుండా పొరుగు దేశ ప్రధాని (మోదీని ఉద్దేశిస్తూ) అడ్డుకుంటున్నారు. మా నీటి హక్కులకు ముప్పు వాటిల్లితే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుంది. ఒప్పందం ప్రకారం మాకు దక్కాల్సిన నీటి వాటాను పరిరక్షించుకోవడానికి మేం కట్టుబడి ఉన్నాం" అని మాలిక్ వ్యాఖ్యానించారు. పాక్ మరో మంత్రి అట్టావుల్లా తరార్ మాట్లాడుతూ.. నీటి అంశం తమ దేశ జాతీయ భద్రతలో కీలక భాగమని పేర్కొన్నారు. సింధూ జలాల ఒప్పందం చట్టబద్ధంగా అమల్లోనే ఉందని, దాన్నెవరూ రద్దు చేయలేరంటూ భారత్‌పై అక్కసు వెళ్లగక్కారు.సింధు, దాని ఉపనదుల జలాలను పంచుకోవడానికి ప్రపంచబ్యాంకు మధ్యవర్తిత్వంతో భారత్ , పాకిస్థాన్‌ల మధ్య 1960లో ఈ ఒప్పందం జరిగింది. అయితే, పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో ఈ ఒప్పందాన్ని నిలిపివేస్తున్నట్లు భారత్ స్పష్టం చేసింది. 2028 జూన్ నాటికి సింధు నదీ జలాల ప్రవాహాన్ని పాకిస్థాన్‌కు పూర్తిగా నిలిపివేయవచ్చని భారత జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ ఇటీవల ఓ కార్యక్రమంలో వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలోనే పాక్ మంత్రులు దీనిపై స్పందిస్తూ.. భారత్‌పై ఆరోపణలు చేస్తున్నారు. నీటి సరఫరాను అడ్డుకునే విధంగా భారత్ వేగంగా చర్యలు తీసుకుంటోందని తమకు అనిపిస్తే, సైనిక చర్యలకూ వెనకాడబోమని ఆ దేశ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ హెచ్చరించారు.



## అరుణాచల్‌ప్రదేశ్‌లో చైనా చొరబాట్లంటూ ప్రచారం.. స్పందించిన భారత సైన్యం

(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ, జూన్ 30)

చైనా పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ అరుణాచల్ ప్రదేశ్‌లో చొరబాట్లకు పాల్పడిందని, అక్కడ సైనిక శిబిరాలను ఏర్పాటు చేసిందని కొన్ని కథనాలు ప్రచారం అవుతున్నాయి. వాటిని భారత సైన్యం తోసిపుచ్చింది. ఆ కథనాల్లో ఎలాంటి వాస్తవం లేదని స్పష్టం చేసింది. "అదంతా ఎలాంటి ఆధారం లేకుండా జరుగుతోన్న అసత్య ప్రచారం" అని వెల్లడించింది.మీడియా కథనాల ప్రకారం.. అరుణాచల్ ప్రదేశ్‌లోని తక్సింగ్ ప్రాంతంలోని నాహ్ ట్రైబల్ గ్రూప్‌నకు చెందిన నాహ్ వెల్ఫేర్ సొసైటీ .. ప్రభుత్వ అధికారులకు గతంలో ఒక వినతి ప్రతాన్ని సమర్పించింది. భారత్–చైనా సరిహద్దు సమీపంలో పీఎల్ఏ శిబిరాలను ఏర్పాటు చేసిందని అందులో ఆరోపించింది. గత 10–15 సంవత్సరాలుగా చైనా సైనికులు తక్సింగ్ సరిహద్దు వెంట చొరబాట్లను క్రమంగా మిగతా 2లో

## రాష్ట్రపతి జీవితమే స్ఫూర్తి..



- విశాఖ గిరిజన వర్సిటీ స్నాతకోత్సవంలో మంత్రి లోకేశ్ ప్రసంగం
- రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జీవితమే గొప్ప స్ఫూర్తి అని వ్యాఖ్య
- సాధారణ గిరిజన గ్రామం నుంచి రాష్ట్రపతి స్థాయికి ఎదిగారని కొనియాడారు
- చంద్రబాబు నాయకత్వంలో ఏపీ ఉన్నత విద్యలో విప్లవాత్మక మార్పులు
- యువత రాజకీయాల్లోకి వచ్చి దేశ గతిని మార్చాలని పిలుపు

(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూన్ 30)

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జీవితం దేశంలోని ప్రతి ఒక్కరికీ, ముఖ్యంగా గిరిజన యువతకు గొప్ప స్ఫూర్తిదాయకమని ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అన్నారు. విశాఖపట్నంలోని కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం తొలి స్నాతకోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. విద్య అనేది కేవలం డిగ్రీలు ప్రదానం చేసే ప్రక్రియ కాదని, అది తరాల భవిష్యత్తును నిర్దేశించే శక్తి అని ఆయన పేర్కొన్నారు.ఈ సందర్భంగా మంత్రి లోకేశ్, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జీవిత ప్రస్థానాన్ని విద్యార్థులకు స్ఫూర్తిదాయకంగా మిగతా 2లో




## విద్యార్థులు భవిష్యత్ లక్ష్యాలను నిర్దేశించుకోవాలి: రాష్ట్రపతి ద్రౌపది ముర్ము



(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ, జూన్ 30)

విశాఖలోని నోవాటెల్‌లో నిర్వహించిన కేంద్రీయ గిరిజన యూనివర్సిటీ ప్రథమ స్నాతకోత్సవానికి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము హాజరయ్యారు. మొత్తం 373 మంది డిగ్రీ, పీజీ విద్యార్థులకు పట్టాలు ప్రదానం చేశారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 13 మంది విద్యార్థులకు రాష్ట్రపతి బంగారు పతకాలు బహూకరించారు. గిరిజన వర్సిటీ.. విద్యార్థుల్లో ఆత్మ విశ్వాసం పెంపొందించే కేంద్రంగా నిలుస్తోందని ఆమె అన్నారు. విద్యార్థులు భవిష్యత్ లక్ష్యాలను నిర్దేశించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, మంత్రులు నారా లోకేశ్, అనిత తదితరులు పాల్గొన్నారు.

## మహారాష్ట్ర ప్రభుత్వ సహకారానికి కృతజ్ఞతలు: డిప్యూటీ సీఎం పవన్



(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూన్ 30)

మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్‌తో ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ భేటీ అయ్యారు. ఇరు రాష్ట్రాల మధ్య పరస్పర ప్రయోజనాలకు సంబంధించిన ముఖ్యమైన అంశాలపై నేతలు చర్చించారు. ముంబయిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో ఈ భేటీ జరిగింది. తూర్పు కనుమల్లో పులుల సంరక్షణ, మహారాష్ట్ర నుంచి రాష్ట్రానికి రెండు ఆడ పులులు ఇచ్చే అంశాలపై చర్చలు సాగాయి. ఉమ్మడి ప్రయోజనాలకు సంబంధించి భవిష్యత్తులో మరింత సహకరించుకోవాలని నిర్ణయించారు.

ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ.. ఆంధ్ర ప్రదేశ్‌లోని తూర్పు కనుమల ప్రాంతంలో ఆడ పులుల సంఖ్య గణనీయంగా తగ్గడంతో జన్యుపరమైన సమస్యలు తలెత్తాయన్నారు. ఈ క్రమంలో పులుల సంఖ్య పునరుద్ధరణకు మహారాష్ట్ర ప్రభుత్వ సహకారం తీసుకుంటున్నట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌కు రెండు ఆడ పులులు మిగతా 2లో

## పవన్ బాధ్యతలు చేపట్టగానే ఫిర్యాదు రఘురామ సంచలన ప్రకటన

పవన్ కల్యాణ్ హోం మంత్రి కాగానే జాడ శ్రవణ్ కుమార్‌పై ఫిర్యాదు చేస్తానన్న రఘురామ

తన నాలుక కోసి సమాధి కడతానని బెదిరించడం హత్యకు ప్రేరేపించడమేనని ఆరోపణ

రాజ్యాంగంలోని అంశాలను వక్రీకరించి మతపరమైన రంగు పులుముతున్నారని విమర్శ

(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూన్ 30)

ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ హోం మంత్రిత్వ శాఖ బాధ్యతలు స్వీకరించిన వెంటనే, జై భీమ్ భారత్ పార్టీ అధ్యక్షుడు జాడ శ్రవణ్ కుమార్‌పై ఫిర్యాదు చేస్తానని రాష్ట్ర అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్



కనుమూరి రఘురామకృష్ణంరాజు స్పష్టం చేశారు. సోమవారం భీమవరంలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.ఏలూరులో జరిగిన ఒక కార్యక్రమంలో శ్రవణ్ కుమార్ తనపై చేసిన వ్యాఖ్యలను రఘురామ తీవ్రంగా ఖండించారు. తన నాలుక కోసి సమాధి కడతానని బెదిరించడం హత్యను ప్రేరేపించే క్రిమినల్ చర్య కిందకే మిగతా 2లో

## నవంబరు 12, 13 తేదీల్లో భాగస్వామ్య సదస్సు



అంతకుముందు 5 చోట్ల ప్రాంతీయ సదస్సులు

నాలెడ్జ్ షేరింగ్‌పై దృష్టి సారించాలి

సన్నాహక సమావేశంలో సీఎం చంద్రబాబు

(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూన్ 30)

విశాఖలో నిర్వహించనున్న భాగస్వామ్య సదస్సును 'ప్రపంచ వ్యాప్తంగా వస్తున్న మార్పులకు అనుగుణంగా.. నాయకత్వం, సాంకేతికత, విశ్వాసం, వ్యాపారం' అనే థీమ్‌తో నిర్వహించనున్నట్లు సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. గతానికి భిన్నంగా ఈసారి ప్రాంతీయ స్థాయిలో సదస్సులు నిర్వహించాలని అధికారులకు సూచించారు. నవంబరులో నిర్వహించనున్న 31వ సీఐఐ సదస్సుపై సచివాలయంలో అధికారులతో సీఎం సోమవారం సమీక్షించారు. 'నవంబరు 12, 13 తేదీల్లో విశాఖలో సీఐఐ బాగస్వామ్య సదస్సు నిర్వహిస్తాం. ఆ రెండు రోజుల్లో ఎంవోయూలు కుదుర్చుకోవడం, మినిస్టీరియల్ సెషన్స్, ప్లీనరీ, కంట్రీ సెషన్స్, బీ2బీ, బీ2జీ సమావేశాలు నిర్వహించేలా ఏర్పాట్లు చేయాలి. దీనికి జాతీయ, అంతర్జాతీయ కంపెనీల ప్రతినిధులు, కేంద్ర మంత్రులు, వివిధ దేశాలకు చెందిన డెలిగేట్స్‌ను ఆహ్వానించాలి. సదస్సు నిర్వహణకు సంబంధించి వివిధ రాష్ట్రాల సీఎంలకు లేఖలు రాయాలి. 2లో



## అమర్‌నాథ్ యాత్రకు ఉగ్రముప్పు.. కేంద్రం హై అలర్ట్!

(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ, జూన్ 30)

జులై 3న ప్రారంభం కానున్న అమర్‌నాథ్ యాత్ర నేపథ్యంలో భద్రతా వ్యవస్థను మరింత బలోపేతం చేశారు. యాత్రను లక్ష్యంగా చేసుకుని ఉగ్రవాదులు దాడులకు ప్రయత్నించే అవకాశం ఉందని భారత నిఘా సంస్థలు అప్రమత్తం చేసినట్లు మిగతా 2లో

## గ్రీస్‌లో భారత యూపీఐ సేవలు.. వాణిజ్య బంధం బలోపేతమే లక్ష్యం

- గ్రీస్‌లో అధికారికంగా ప్రారంభమైన యూపీఐ సేవలు
- కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ సమక్షంలో ఏథెన్స్‌లో ప్రత్యక్ష ప్రదర్శన
- తక్కువ ఖర్చుతో తక్షణమే నగదు బదిలీ చేసుకునే వెసులుబాటు
- భారత్‌లో పెట్టుబడులు పెట్టాలని గ్రీక్ వ్యాపార, వాణిజ్య వర్గాలను ఆహ్వానించిన గోయల్




(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ, జూన్ 30)

భారత డిజిటల్ చెల్లింపుల వ్యవస్థ 'యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్' (యూపీఐ) తన ప్రపంచవ్యాప్త విస్తరణలో మరో కీలక మైలురాయిని చేరుకుంది. తాజాగా యూరప్ దేశమైన గ్రీస్‌లో యూపీఐ సేవలు అధికారికంగా ప్రారంభమయ్యాయి. కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ ఈ సేవలను లాంఛనంగా ప్రారంభించారు. ఏథెన్స్‌లోని యూరో బ్యాంక్ ప్రధాన కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో యూపీఐ ద్వారా లావాదేవీని ప్రత్యక్షంగా ప్రదర్శించారు.ఈ సందర్భంగా పీయూష్ గోయల్ మాట్లాడుతూ.. గ్రీస్‌లో యూపీఐ సేవలు మిగతా 2లో



## రాజ్యసభ సభ్యులుగా 8 మంది ప్రమాణం

(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ, జూన్ 30)

కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, భాజపా నేత తరుణ్ ఛుగ్‌తోపాటు మరో ఆరుగురు రాజ్యసభ సభ్యులుగా సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. కర్ణాటక నుంచి ఎగువ సభకు తిరిగి ఎన్నికైన ఖర్గేతో ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ మిగతా 2లో

# రాష్ట్రపతి జీవితమే స్ఫూర్తి..

వివరిస్తూ భావోద్వేగ ప్రసంగం చేశారు. "ఈ విశ్వవిద్యాలయం ఎందుకు ముఖ్యమో చెప్పడానికి మన ప్రియతమ రాష్ట్రపతి జీవితం కంటే గొప్ప ఉదాహరణ లేదు. ఒడిశాలోని మయూర్‌భంజ్ జిల్లా ఉపర్‌బేడా అనే చిన్న గిరిజన గ్రామంలో పుట్టిన ఆమె, పాఠశాలకు వెళ్లడమే కష్టమైన పరిస్థితులను ఎదుర్కొన్నారు. ఆ రోజుల్లో గిరిజన బాలికలు ఉన్నత విద్యను అభ్యసించడం చాలా అరుదు. అయినప్పటికీ, తన గ్రామం నుంచి గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన మొదటి మహిళగా ఆమె నిలిచారు. ఆ ఒక్క అడుగు ఆమె భవిష్యత్తునే కాకుండా, తర్వాతి తరం అమ్మాయిల ఆకాంక్షలను కూడా మార్చేసింది" అని లోకేశ్ వివరించారు.రాజకీయాల్లోకి రాకముందు ఆమె ఉపాధ్యాయురాలిగా పనిచేశారని, జీవితాలను తీర్చిదిద్దడంలోనే తనకు అత్యంత సంతృప్తి లభించిందని ఆమె తరచూ చెబుతారని గుర్తుచేశారు. "ఆమె ప్రజా జీవితం ఎప్పుడూ ప్రత్యేకాధికారాలతో నిర్మితం కాలేదు. కౌన్సిలర్‌గా మొదలై, వైస్ ఛైర్‌పర్సన్, ఎమ్మెల్యే, మంత్రి, గవర్నర్, చివరకు భారత రాష్ట్రపతి స్థాయికి అంచెలంచెలుగా ఎదిగారు. ప్రతి మైలురాయిని సంవత్సరాల ప్రజా సేవ ద్వారానే ఆమె సాధించారు" అని లోకేశ్ కొనియాడారు.ఆమె జీవితంలో ఎదుర్కొన్న వ్యక్తిగత విషాదాలను కూడా లోకేశ్ ప్రస్తావించారు. "2009 నుంచి 2014 మధ్య కాలంలో ఇద్దరు కుమారులు, భర్త, తల్లి, సోదరుడిని కోల్పోయారు. అటువంటి దుఃఖాన్ని మనలో చాలా మంది ఊహించలేరు. అయినా ఆమె నిరాశకు లొంగిపోలేదు. ఆధ్యాత్మికతలో లీనమై, ప్రజా సేవలోకి తిరిగి వచ్చి, తన వ్యక్తిగత బాధను ఇతరుల పట్ల కరుణగా మార్చుకున్నారు. పేదలు కలలు కనడమే కాదు, వాటిని నెరవేర్చుకోగలరనడానికి నా ఎన్నికలే నిదర్శనం అని ఆమె రాష్ట్రపతిగా ప్రమాణం చేసినప్పుడు చెప్పారు. ఆ మాటలు కేవలం ఉత్సవ ప్రసంగం కాదు, అది అడ్డంకులను ఎదుర్కొని జీవించిన జీవిత సారం," అని లోకేశ్ ఉద్వేగంగా అన్నారు.ప్రధాని నరేంద్ర మోదీ స్ఫూర్తితో, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్‌లో ఉన్నత విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకువస్తున్నామని లోకేశ్ తెలిపారు. "ప్రతి విద్యార్థికి ఉపాధి, ప్రతి విశ్వవిద్యాలయం వినూత్నంగా, ప్రతి పరిశోధకుడు శక్తిమంతుడిగా ఉండాలన్నదే మా లక్ష్యం. ప్రపంచంలో అత్యుత్తమ ప్రతిభతో పోటీపడే ఆత్మవిశ్వాసాన్ని ప్రతి యువకుడిలో నింపాలనుకుంటున్నాం" అని ఆయన స్పష్టం చేశారు.విద్యార్థులకు సందేశమిస్తూ, "విజయాన్ని మీరు పొందే పదవితో కాకుండా, మీరు సృష్టించే మార్పుతో, మీరు తాకిన జీవితాలతో కొలవండి. డిగ్రీ మీకు వృత్తిని ఇవ్వొచ్చు, కానీ శీలం గౌరవాన్ని, సేవ వారసత్వాన్ని ఇస్తాయి. మీలో కొందరు రాజకీయాల్లోకి వచ్చి దేశ రాజకీయ గమనాన్ని మార్చాలని నేను ఆకాంక్షిస్తున్నాను" అని లోకేశ్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, గవర్నర్ అబ్దుల్ నజీర్, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తదితరులు పాల్గొన్నారు.

## మహారాష్ట్ర ప్రభుత్వ సహకారానికి కృతజ్ఞతలు: డిప్యూటీ సీఎం పవన్

తలెత్తాయన్నారు. ఈ క్రమంలో పులుల సంఖ్య పునరుద్ధరణకు మహారాష్ట్ర ప్రభుత్వ సహకారం తీసుకుంటున్నట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌కు రెండు ఆడ పులులు ఇచ్చేందుకు మహారాష్ట్ర ప్రభుత్వం అంగీకరించిందని.. ఈ సహకారానికి మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు చెప్పారు. తూర్పు కనుమలలో పులుల సంరక్షణ చరిత్రలో ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలిచిపోతుందన్నారు.

## పవన్ బాధ్యతలు చేపట్టగానే ఫిర్యాదు: రఘురామ సంచలన ప్రకటన

చేసిన వ్యాఖ్యలను రఘురామ తీవ్రంగా ఖండించారు. తన నాలుక కోసి సమాధి కడతానని బెదిరించడం హత్యను ప్రేరేపించే క్రిమినల్ చర్య కిందకే వస్తుందని ఆయన మండిపడ్డారు. ఒక వర్గానికి సంబంధించి సుప్రీంకోర్టు తీర్పులు, రాజ్యాంగ పరమైన అంశాలను తాను ప్రస్తావిస్తే.. వాటిని శ్రవణ్ కుమార్ వక్రీకరిస్తూ మతపరమైన రంగు పులుముతున్నారని ఆరోపించారు. తాను ఎన్నడూ ఏ మతాన్ని లేదా కులాన్ని కించపరిచేలా మాట్లాడలేదని రఘురామ వివరణ ఇచ్చారు.ఆకివీడులో రామాలయ పునర్నిర్మాణ ప్రాంగణంలో జనసేన నాయకులపై జరిగిన దాడిని ప్రస్తావిస్తూ, ఆ ఘటనకు మతపరమైన రంగు పులిమే ప్రయత్నాలపై ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. తాను హోం మంత్రిని కాకపోవడం వల్లే నేరగాళ్లు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని ఇటీవల పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలను రఘురామ ఈ సందర్భంగా గుర్తు చేశారు. పవన్ హోం మంత్రిగా బాధ్యతలు స్వీకరించాకే ఈ అంశంపై ఫిర్యాదు చేస్తానని ఆయన స్పష్టం చేశారు.రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న వ్యక్తిపై ఇటువంటి అనుచిత వ్యాఖ్యలు చేస్తే కూటమి ప్రభుత్వం చూస్తూ ఊరుకోదని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఒకవేళ ప్రభుత్వం సుమోటోగా చర్యలు తీసుకోకపోయినా, తనపై ఉన్న అభిమానంతో ఎవరో ఒకరు తప్పకుండా ఫిర్యాదు చేస్తారని రఘురామకృష్ణంరాజు పేర్కొన్నారు.

# మొదటి పేజీ తరువాయి

## అమర్‌నాథ్ యాత్రకు ఉగ్రముప్పు.. కేంద్రం హై అలర్ట్!

అప్రమత్తం చేసినట్లు సమాచారం. దీంతో యాత్ర మార్గమంతా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టారు.నిఘా వర్గాల సమాచారం ప్రకారం.. పాకిస్థాన్‌లోని ఖైబర్ పఖ్తున్‌ఖ్వా, బలూచిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీవోకే) ప్రాంతాల్లో కల్లోల పరిస్థితులు నెలకొన్నాయి. వాటి నుంచి ప్రజల దృష్టిని మరల్చేందుకు పాక్ గూఢచార సంస్థ ఐఎస్ఐ భారత్‌లో అలజడి సృష్టించే ప్రయత్నాలు చేయవచ్చని అంచనా వేస్తున్నారు. ముఖ్యంగా అమర్‌నాథ్ యాత్రను లక్ష్యంగా చేసుకునే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు.నిఘా సంస్థలు గుర్తించిన సమాచారం ప్రకారం.. జమ్మూకశ్మీర్‌లో అడవుల్లో దాక్కున్న కొంతమంది ఉగ్రవాదులతో పాక్ మూకలు సంప్రదింపులు జరిపే ప్రయత్నాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. పెద్దఎత్తున దాడులు జరిపేలా వారిని ప్రేరేపించే యత్నాలు జరుగుతున్నాయని భద్రతా వర్గాలు భావిస్తున్నాయి.ఈ హెచ్చరికల నేపథ్యంలో యాత్ర మార్గంలో భారీగా పోలీసు, భద్రతా బలగాలను మోహరించారు. ఉగ్రవాద వ్యతిరేక నిఘా వ్యవస్థను మరింత బలోపేతం చేశారు. అత్యాధునిక కృత్రిమ మేధ ఆధారిత కెమెరాలు, డిజిటల్ స్కానింగ్ వ్యవస్థలను కూడా ఏర్పాటు చేశారు. యాత్రికుల భద్రతకు ఎలాంటి లోటు లేకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని అధికారులు తెలిపారు.ఇదే సమయంలో జమ్మూకశ్మీర్‌లోని రాజౌరీ జిల్లాలో ఉగ్రవాదుల కోసం భద్రతా బలగాలు విస్తృతంగా గాలింపు చర్యలు కొనసాగిస్తున్నాయి. దట్టమైన అటవీ ప్రాంతాల్లో ఆపరేషన్‌లు కొనసాగుతున్నాయని అధికారులు వెల్లడించారు. బలగాలు అప్రమత్తంగా ఉన్నప్పటికీ, యాత్రికులు అధికారిక సూచనలు పాటించాలని, వదంతులను నమ్మొద్దని భద్రతా వర్గాలు సూచిస్తున్నారు.

## రాజ్యసభ సభ్యులుగా 8 మంది ప్రమాణం

ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ తన ఛాంబర్‌లో ప్రమాణం చేయించారు. ఖర్గే పదవీ కాలం ఈ నెల 25న ముగియడంతో తిరిగి ఆయన మళ్లీ ఎగువ సభకు ఎన్నికయ్యారు. మళ్లీ ఆయనే ప్రతిపక్ష నేతగా కొనసాగుతారు. ప్రమాణం అనంతరం ఖర్గే మాట్లాడుతూ.. ప్రజా సమస్యలపై ఎప్పటికప్పుడు ప్రశ్నిస్తూ.. ప్రభుత్వం జవాబుదారీగా వ్యవహరించేలా ఒత్తిడి చేయడమే తన ప్రధాన బాధ్యతని స్పష్టం చేశారు. రాబోయే వర్షాకాల సమావేశాల్లో ఇండియా కూటమితో కలిసి పని చేస్తానని తెలిపారు. జితేంద్ర కంజరియా, మాన్‌సింగ్ పర్మార్ (గుజరాత్), ఎం.నాగరాజా (కర్ణాటక), రాజేంద్ర జైన్ (మహారాష్ట్ర), శారదా దేవి (మణిపూర్), అల్కాసింగ్ (రాజస్థాన్) ప్రమాణం చేసిన వారిలో ఉన్నారు. ఈ కార్యక్రమంలో సోనియా గాంధీ, ప్రియాంకా గాంధీ, కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, కిరణ్ రిజిజు పాల్గొన్నారు.

## నవంబరు 12, 13 తేదీల్లో భాగస్వామ్య సదస్సు

దీనికి జాతీయ, అంతర్జాతీయ కంపెనీల ప్రతినిధులు, కేంద్ర మంత్రులు, వివిధ దేశాలకు చెందిన డెలిగేట్స్‌ను ఆహ్వానించాలి. సదస్సు నిర్వహణకు సంబంధించి వివిధ రాష్ట్రాల సీఎంలకు లేఖలు రాయాలి. జులై నుంచి సెప్టెంబరు వరకు దేశ, విదేశాల్లో రోడ్‌షోలు నిర్వహించాలి. ముందుగా విశాఖ, రాజమహేంద్రవరం/కాకినాడ, అమరావతి, అనంతపురం, తిరుపతి నగరాల్లో ప్రాంతీయ భాగస్వామ్య సమావేశాలు నిర్వహించాలి. సదస్సుల్లో కుదుర్చుకునే ఎంవోయూలపై అధికారులు ప్రణాళికలతో సిద్ధం కావాలి' అని సీఎం పేర్కొన్నారు. 'ప్రాంతీయ స్థాయిలో సదస్సులు నిర్వహించడం ద్వారా ప్రజలు, యువత, విద్యార్థుల భాగస్వామ్యం మరింతగా పెరుగుతుంది. యువతలోని వినూత్న ఆలోచనలు ఆయా రంగాల పారిశ్రామికవేత్తల దృష్టికి వెళ్లడం సాధ్యం అవుతుంది. ప్రాంతీయ సదస్సుల్లో స్టార్టప్‌లు, ఇన్నోవేషన్లకు ప్రాధాన్యం కల్పించాలి. ఇక్కడా ఎంవోయూలు కుదుర్చుకునేందుకు ప్రాధాన్యమివ్వాలి. జెన్ జీ భాగస్వామ్యం ఉండేలా చూడాలి' అని సీఎం ఆదేశించారు.

**కొత్త ఆలోచనలకు వేదిక కావాలి**

భాగస్వామ్య సదస్సులంటే కేవలం ఎంవోయూలు కుదుర్చుకోవడం, పెట్టుబడులు రాబట్టడం అనే భావన పోవాలని సీఎం పేర్కొన్నారు. 'అక్కడ వివిధ కీలక అంశాలపై చర్చ జరగాలి. పెట్టుబడులు, ఎంవోయూల కంటే నాలెడ్జ్ షేరింగ్ అనేది ముఖ్యం. విశాఖలో జరగనున్న కార్యక్రమాలపై ప్రజలు చర్చించుకోవాలి. ఆయా రంగాల్లో ఏ విధంగా అభివృద్ధి సాధించొచ్చనే ఆలోచనలు వారిలో రేకెత్తించాలి. భవిష్యత్తులో అవకాశాలు వచ్చే రంగాలపై ఎక్కువ దృష్టి సారించాలి. వ్యవసాయం, ఉద్యానరంగం, ప్రకృతి వ్యవసాయం, సర్క్యులర్ ఎకానమీ, ఆధ్యాత్మికత, ఒత్తిడి లేని పనివిధానం వంటి అంశాల గురించి చర్చించాలి' అని సూచించారు. ఒప్పందాలు, రోడ్‌షోల నిర్వహణపై ప్రణాళికను అధికారులు సీఎంకు తెలిపారు. మంత్రులు టీజీ భరత్, కొండపల్లి శ్రీనివాస్, పొంగూరు నారాయణ, కందుల దుర్గేష్, గొట్టిపాటి రవికుమార్, సీఐఐ డైరెక్టర్ జనరల్ చంద్రజీత్ బెనర్జీ పాల్గొన్నారు.

**ఎల్‌నినో లాంటి సవాళ్లను రైతన్నలు అధిగమించాలి: ముఖ్యమంత్రి**

ఎల్‌నినో, అంతర్జాతీయ పరిస్థితుల కారణంగా తలెత్తే సవాళ్లను రైతన్నలు అధిగమించాలని సీఎం చంద్రబాబు అన్నారు. ప్రభుత్వ సూచనలు, సలహాలు పాటిస్తూ సాగుతో సిరులు పండించాలని కోరారు. పాడిపంటలతో రైతుల ఇళ్లలో వెలుగులు నిండాలని... ఏరువాక పౌర్ణమి సందర్భంగా అన్నదాతలకు ఎక్స్ వేదికగా శుభాకాంక్షలు తెలిపారు. "ప్రకృతిని పూజించే గడ్డపై పుట్టిన మనం ఆ సంప్రదాయాన్ని పాటిద్దాం. ప్రకృతి సాగుతో పంటలు పండించి భూమిని, ఆరోగ్యాన్ని కాపాడుకుందాం" అని పిలుపునిచ్చారు.

## అరుణాచల్‌ప్రదేశ్‌లో చైనా చొరబాట్లంటూ ప్రచారం.. స్పందించిన భారత సైన్యం

సమీపంలో పీఎల్‌ఏ శిబిరాలను ఏర్పాటు చేసిందని అందులో ఆరోపించింది. గత 10–15 సంవత్సరాలుగా చైనా సైనికులు తక్సింగ్ సరిహద్దు వెంట చొరబాట్లను క్రమంగా విస్తరిస్తున్నారని పేర్కొంది. వేట, పశువుల మేత, అటవీ ఉత్పత్తుల సేకరణ కోసం స్థానికులు ఉపయోగించే ప్రదేశాల్లో రోడ్లు, వంతెనలు, సైనిక శిబిరాలను నిర్మించారని ఆరోపించింది. ఆ ప్రాంతాల పేర్లను ప్రస్తావించింది. భారత సరిహద్దు ప్రాంతాల్లో చైనా కార్యకలాపాలు మరింత విస్తరించకుండా నిరోధించేలా రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు జోక్యం చేసుకోవాలని కోరింది. ఈ వినతి పత్రాన్నే మీడియా కథనాలు పేర్కొన్నాయి. ఈ నేపథ్యంలోనే ఆర్మీ స్పందన వచ్చింది. ఇటీవల బీజింగ్‌లో భారత్–చైనా సరిహద్దు వ్యవహారాలకు సంబంధించిన సమావేశం జరిగింది. రెండు దేశాల మధ్య నిర్మాణాత్మక చర్చలు జరిగాయని విదేశాంగ శాఖ వెల్లడించింది. ఈ నేపథ్యంలోనే మీడియా కథనాలు రావడం గమనార్హం.

## సింధూ జలాల్లో చుక్క నీరు కూడా మోదీ వదలట్లేదు: పాక్ అక్కసు


జలాల ప్రవాహాన్ని పాకిస్థాన్‌కు పూర్తిగా నిలిపివేయవచ్చని భారత జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ ఇటీవల ఓ కార్యక్రమంలో వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలోనే పాక్ మంత్రులు దీనిపై స్పందిస్తూ.. భారత్‌పై ఆరోపణలు చేస్తున్నారు. నీటి సరఫరాను అడ్డుకునే విధంగా భారత్ వేగంగా చర్యలు తీసుకుం టోందని తమకు అనిపిస్తే, సైనిక చర్యలకూ వెనకాడబోమని ఆ దేశ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ హెచ్చరించారు.

## గ్రీస్‌లో భారత యూపీఐ సేవలు.. వాణిజ్య బంధం బలోపేతమే లక్ష్యం

అందుబాటులోకి రావడంతో అర్హులైన వినియోగదారులు తక్షణమే, అత్యంత సురక్షితంగా నగదు బదిలీ చేసుకోవచ్చని తెలిపారు. సంప్రదాయ పద్ధతులతో పోలిస్తే లావాదేవీల ఖర్చు దాదాపు నామమాత్రంగా ఉంటుందని ఆయన వివరించారు. సరిహద్దులు దాటి విలువను సృష్టించడం, ఉమ్మడి వృద్ధి కోసం భాగస్వామ్యాలను పెంపొందించడం లక్ష్యంగా సాంకేతిక పరిష్కారాలను నిర్మించాలన్న ప్రధాని మోదీ దార్శనికతకు ప్రపంచవ్యాప్తంగా యూపీఐకి లభిస్తున్న ఆదరణ నిదర్శనమని గోయల్ తన 'ఎక్స్' ఖాతాలో పేర్కొన్నారు.

తన గ్రీస్ పర్యటనలో భాగంగా గోయల్ యూరోబ్యాంక్ సీఈఓ ఫోకియోన్ కరావియాస్‌తో సమావేశమయ్యారు. భారత్–గ్రీస్ ఆర్థిక భాగస్వామ్యాన్ని మరింత విస్తరించడంపై ఫలవంతమైన చర్చలు జరిపారు. భారత్‌లో పెట్టుబడులు పెట్టాలని గ్రీక్ వ్యాపారవేత్తలను ప్రోత్సహించిన ఆయన, గ్రీస్‌లో తయారీ మరియు మౌలిక సదుపాయాల అభివృద్ధిలో సహకారానికి ఉన్న అవకాశాలను అన్వేషించారు. యూరోబ్యాంక్, ఎన్ఐపీఎల్ భాగస్వామ్యంతో ఈ సేవలు అందుబాటులోకి వచ్చాయి. ఈ కార్యక్రమంలో ఫెయిర్‌ఫాక్స్ డిజిటల్ సర్వీసెస్ సీఈఓ సంజయ్ తుగ్నైత్ కూడా పాల్గొన్నారు.అంతకుముందు పీయూష్ గోయల్ గ్రీస్ డిప్యూటీ విదేశాంగ మంత్రి హ్యారీ థియోహారిస్‌తో కలిసి 'ఇండియా–గ్రీస్ బిజినెస్ ఫోరమ్'లో ప్రసంగించారు. భారతదేశ అద్భుతమైన వృద్ధి, బలమైన స్థూల ఆర్థిక పునాదులు గ్రీస్‌కు అపూర్వమైన అవకాశాలను అందిస్తున్నాయని ఆయన నొక్కిచెప్పారు. భారత్–ఈయూ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ) వాణిజ్యం, పెట్టుబడులు, ఆర్థిక సహకారంలో కొత్త అవకాశాలను సృష్టిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. కీలక రంగాల్లో కలిసి పనిచేసేందుకు అపారమైన అవకాశాలున్నాయని భారత కంపెనీలతో చేతులు కలపాలని గ్రీక్ వ్యాపార వర్గాలకు ఆయన పిలుపునిచ్చారు. ఈ పర్యటన రెండు దేశాల మధ్య బలమైన వ్యాపార సంబంధాలకు, ఉమ్మడి శ్రేయస్సుకు మార్గం సుగమం చేస్తుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

## దుర్గి ఎస్ఐగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన బి గోపాల్‌ను ఘనంగా సత్కరించిన డాక్టర్ కుక్కమూడి ప్రసాద్



(షణ్ముఖ వెలుగు, మాచర్ల టౌన్, జూన్ 30) ఇటీవల దుర్గి పోలీస్ స్టేషన్ ఎస్ఐగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన బి గోపాల్‌ను మంగళవారం దుర్గి పోలీస్ స్టేషన్లో పల్నాడు జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ మెంబర్, దళిత బహుజన సంక్షేమ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కుక్కమూడి ప్రసాద్ శాలవాలతో ఘనంగా సత్కరించి అభినందనలు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ దుర్గి పోలీస్ స్టేషన్‌కు యంగ్ డైనమిక్ సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్‌గా బి గోపాల్ బాధ్యతలు చేపట్టటం గర్వంగా ఉందని అన్నారు. దుర్గి పోలీస్ స్టేషన్ పరిధిలోని శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని,ప్రజలకు పోలీసులకు మధ్య స్నేహ పూర్వక సంబంధాలు ఉండే విధంగా చూడాలని, ఎస్సీ, ఎస్టీల పై దాడులు, అత్యాచారాలు జరిగినప్పుడు రిపోర్ట్ ఇచ్చిన వెంటనే ఎఫ్ఐఆర్ అయ్యేలా చూడాలని, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లోని బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని, గ్రామాలలోని ఎస్సీ, ఎస్టీ వర్గాల ప్రజలు నివసించే ప్రాంతంలో యువత చెడు వ్యసనాలకు లోనవుతున్నారని, వారు అసాంఘిక కార్యక్రమాలకు ఆకర్షితులవుతున్నారని అందుచేత పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో అటువంటి ప్రాంతాలలో చట్టాల పట్ల అవగాహన కలిగే విధంగా, యువతను చైతన్యపరిచే కార్యక్రమాలు చేపట్టాలని ప్రతినెల చివరి వారంలో గ్రామాల్లో నిర్వహించే పౌరహక్కుల దినోత్సవం కార్యక్రమంలో పోలీస్ వారు హాజరయ్యే విధంగా చూడాలని సమస్యలను పరిష్కరించాలని ఆయనను కోరారు. ఎస్ఐ గోపాల్ సమస్యల పట్ల సానుకూలంగా స్పందించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన తెలిపారు. ఎస్ఐ గోపాల్‌కు అభినందనలు తెలియజేసిన వారిలో సీనియర్ దళిత నాయకుడు ఆరుమళ్ళ ఇశ్రాయేలు ఉన్నారు.

## కడప జిల్లా ఆర్యవైశ్య సంఘం (రూరల్) ఉపాధ్యక్షులుగా సుంకు శివరామయ్య

(షణ్ముఖ వెలుగు, బద్వేల్, జూన్ 30)

కడప జిల్లా ఆర్యవైశ్య సంఘం (రూరల్) ఉపాధ్యక్షులుగా సుంకు శివరామయ్య నియమితులయ్యారు. ఈ సందర్భంగా కడప జిల్లా ఆర్యవైశ్య యువజన సంఘం (రూరల్) వర్కింగ్ ప్రెసిడెంట్ దొంతు సతీష్, వేంపల్లె మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు వడ్లకుంట వీరేంద్రనాథ్‌లు వేముల అమ్మవారిశాలలో వాసవి మాతను దర్శించుకున్నారు. అనంతరం కడప జిల్లా ఆర్యవైశ్య సంఘం (రూరల్) అధ్యక్షులు వల్లంకొండు వెంకటరమణ నియమించిన వేముల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు సుంకు శివరామయ్యను కడప జిల్లా ఆర్యవైశ్య యువజన సంఘం (రూరల్) వర్కింగ్ ప్రెసిడెంట్ దొంతు సతీష్,వేంపల్లె మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు వడ్లకుంట వీరేంద్రనాథ్ లు శాలువతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా శివరామయ్య జిల్లా అధ్యక్షులు వల్లంకొండు వెంకటరమణకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో వేముల ఆర్యవైశ్య సంఘం మరియు యువజన సంఘం కమిటీ సభ్యులు, పెద్దలు పాల్గొన్నారు.

**వేముల మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులుగా మేడా నాగేష్ కుమార్...** వేముల మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులుగా మేడా నాగేష్ కుమార్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా వేములకు చెందిన మేడా కృష్ణమూర్తి కుమారుడైన మేడా నాగేష్ కుమార్ ను నియమించినట్లు కడప జిల్లా ఆర్యవైశ్య సంఘం (రూరల్) అధ్యక్షులు వల్లంకొండు వెంకటరమణ వెల్లడించారు. మంగళవారం వేముల అమ్మవారిశాలలో నాగేష్ కుమార్‌ను శాలువతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.ప్రస్తుతం ఈయన వేముల ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షులుగా, వేముల వాసవి క్లబ్ అధ్యక్షులుగా సేవలు అందిస్తున్నట్లు వేముల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు సుంకు శివరామయ్య తెలిపారు. తన సేవలు గుర్తించి ఈ పదవిని అప్పగించారని తెలిపారు.









ప్రకాశం | మార్కాపురం | బాపట్ల


షణ్ముఖ
# వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు — తెలుగు దినపత్రిక
01.07.26 బుధవారం


# నీళ్ళు...నీళ్ళు...నీళ్ళు....!!!

**ఏ వార్డు కెళ్ళినా**
**నీరు, డ్రైనేజీ, శానిటేషన్ సమస్యలు ఏకరువు**
**మార్కాపురం ఎమ్మెల్యే కందులకు**
**మొరపెట్టుకున్న వార్డు ప్రజలు**
**కూటమి ప్రభుత్వంలో సాగర్ నీటి కోసం**
**ప్రజల వెతలు**
**నెలలు గడుస్తున్నా నీరిచ్చే పరిస్థితి లేదు**
**ఇక డ్రైనేజీ, శానిటేషన్ పరిస్థితి అంతంతమాత్రం**
**అధికారం చేపట్టిన ప్రతి అధికారి వారి**
**జేబులు నింపుకునేందుకే ప్రాధాన్యత**
**ఇదీ పొదిలి ప్రజల పరిస్థితి**
**పొదిలి ప్రజల నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం**
**త్వరలో రూ.130 కోట్లతో జలజీవన్**
**మిషన్ ద్వారా ఇంటింటికి కుళాయి**
**మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి**




(షణ్ముఖ వెలుగు, పొదిలి, జూన్ 30)

నీళ్ళు....నీళ్ళు....నీళ్ళు... అంటూ పొదిలి నగరపంచాయతీలోని ఏ వార్డుకెళ్ళినా ప్రజలు కోరుతున్నది ఇదే...పొదిలి నగర పంచాయతీ పరిధిలో ఎస్ఐఆర్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం దాదాపు అన్ని వార్డులో మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మొదటి వార్డు నుంచే ప్రజలు బహిరంగంగా తమకు సాగర్ జలాలు రావడం లేదని, డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేదని, శానిటేషన్ పరిస్థితి అధ్వాన్నంగా ఉందని ఘొల్లుమన్నారు. మొదటి వార్డులో ఏ సమస్యలు అయితే ప్రజలు ఎమ్మెల్యే ముందుకు ఏకరువు పెట్టారో ఇక మిగిలిన ఏ వార్డుకెళ్ళినా అవే సమస్యలపై ప్రజలు ఎమ్మెల్యేకు తమ గోడు విన్నవించుకున్నారు. దాదాపు నగర పంచాయతీ పరిధిలోని అనేక ప్రాంతాల్లో నెలలు గడుస్తున్నా సాగర్ జలాలు రాని పరిస్థితి నెలకొంది. ఈ సమస్యకు కారణాలు మాత్రం అధికారులు ప్రజలకు చెప్పలేని పరిస్థితిలో ఉన్నారంటే పరిస్థితి ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. నగర పంచాయతీ ప్రజలకు ప్రధానంగా తాగు నీరు, డ్రైనేజీ, శానిటేషన్ లు సక్రమంగా జరుగుతుంటే మిగిలిన సమస్యల పై ప్రజలు పెద్దగా పట్టించుకోరు. కానీ పొదిలి నగర పంచాయతీలో మాత్రం ఆ మూడు సమస్యలను పరిష్కరించేందుకు అటు అధికారులు, ఇటు రాజకీయ నాయకులు పెద్దగా పట్టించుకున్న దాఖలాలు లేవు. ఎమ్మెల్యే కందుల ఎన్ని సార్లు అటు అధికారులు, ఇటు స్థానిక నాయకులకు చెప్పినా ఆయన మాటలు పెడచెవిన పెడుతూనే ఉన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాతా పొదిలి మున్సిపాల్టీకి సుమారు 6 గురు మున్సిపల్ కమిషనర్లు మారారు. అయినా పొదిలి నగర పంచాయితీ ప్రజల తలరాతలు మాత్రం మారలేదు. వీరిలో ఒకరిద్దరు కమిషనర్లు మినహా మిగిలిన వారంతా వారి జేబులు నింపుకునేందుకు సీటు ఎక్కారని చెప్పడంలో అతిశయోక్తి లేదు. వారికి ప్రజల సమస్యలు పట్టవు. ఏ బిల్లుల్లో ఎంత నొక్కచ్చో లెక్కలు వేసుకోవడం తప్ప ప్రజలకు చేసిందేమీ లేదు. ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నా అధికారులు మాత్రం ఆయనకు చెడ్డపేరు తేవడమే లక్ష్యంగా పని చేశారని చెప్పడంలో సందేహం లేదు. నూతనంగా కమిషనర్‌గా వచ్చిన ఆంజనేయులు కేవలం 15 రోజులు మాత్రమే కావడంతో ఆయన కొంత పనితీరు చూపిస్తున్నారు. మరి కొద్ది రోజులు గడిస్తే తప్ప ఆయన పొదిలి అభివృద్ధికి ఏ విధంగా చర్యలు చేపడతారో చూడాలి మరి. ఓ వైపు కూటమి ప్రభుత్వం ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తుంటే ఒక్క పొదిలి నగర పంచాయతీలో మాత్రం సాగర్ నీరు అందించడంలో ఘోరంగా విఫలం చెందింది. చాలా ప్రాంతాల్లో నెలలు గడుస్తున్నా చుక్క సాగర్ నీరు ఇచ్చిన దాఖలాలు లేవని ఆయా ప్రాంతాల ప్రజలు వాపోతున్నారు. మంగళవారం పొదిలి పట్టణంలో విస్తృత పర్యటనకు వచ్చిన ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డికి ప్రజలు సాగర్ నీటి కోసం పడుతున్న కష్టాలు ఏకరువు పెట్టారు. ఏ వార్డులోకి వెళ్ళినా ప్రధానంగా సాగర్ నీరు రావడం లేదనేది ప్రజలు స్పష్టంగా తెలియజేశారు. రెండు సంవత్సరాలు దాటినా నేటికీ సక్రమంగా ప్రజలకు సాగర్ జలాలు ఇవ్వడం లేదంటే టీడీపీ స్థానిక నేతలు ఏ విధంగా ప్రజలకు పనులు చేస్తున్నారో అర్థం చేసుకోవచ్చు. ఎమ్మెల్యే ఎంత కష్టపడి ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు గ్రీవెన్స్‌లు నిర్వహిస్తున్నా పొదిలి నగర పంచాయతీలో మాత్రం సాగర్‌నీరు, డ్రైనేజీ, శానిటేషన్ సమస్యలు మాత్రం నేటికీ పరిష్కారం కాని వాటిగానే ఉన్నాయి. ఇదే విధంగా గనుక కొనసాగితే రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు కూటమి ప్రభుత్వానికి గుణపాఠం చెప్పడం ఖాయంగా కనిపిస్తోంది.

**త్వరలో జలజీవన్ మిషన్ పథకం కింద రూ.130 కోట్లతో ప్రత్యేక ప్రాజెక్టు ప్రారంభం ఎమ్మెల్యే కందుల**

పొదిలి పట్టణంలోని మంగళవారం సుడిగాలి పర్యటన చేసిన ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డికి ఏ వార్డుకు వెళ్ళినా ప్రజలు ఎదుర్కొంటున్న నీటి సమస్య స్పష్టంగా తెలిసింది. దీంతో ఆయన మండల ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ పొదిలి ప్రజల నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడమే తన లక్ష్యమన్నారు. జల జీవన్ మిషన్ పథకం కింద రూ.130 కోట్ల నిధులతో రామతీర్థం జలాశయం నుంచి ప్రత్యేక ప్రాజెక్టుతో పొదిలిలోని ఇంటింటికి కుళాయి వేసి నీటిని అందిస్తామని, ఆ ప్రాజెక్టును త్వరలోనే ప్రారంభించడం జరుగుతుందని ఆయన ప్రజలకు తెలిపారు.

## జిల్లా రూపురేఖలు మారటంలో సిబ్బంది సేవలు అత్యంత కీలకం

**జిల్లా కలెక్టర్ పి రాజాబాబు**




(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, జూన్ 30)

అభివృద్ధిపరంగా జిల్లా రూపురేఖలు మారటంలో క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న సిబ్బంది సేవలు అత్యంత కీలకమని జిల్లా కలెక్టర్ పి రాజాబాబు చెప్పారు. ఈ దిశగా ప్రత్యేక దృష్టి సారించాలని వారికి దిశా నిర్దేశం చేశారు. వివిధ శాఖలలో మండల స్థాయిలో పని చేస్తున్న సిబ్బందికి సామర్థ్యం పెంపు కోసం ప్రకాశం భవనంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో మంగళవారం ఆయన పాల్గొని పలు సూచనలు చేశారు. స్వర్ణాంధ్ర - 2047 కార్యక్రమంలో భాగంగాకి పెర్ఫార్మెన్స్ ఇండికేటర్స్ (కేపీఐ) పై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. క్షేత్రస్థాయిలో గ్రాస్ వ్యాల్యూ ఎడిషన్ (జీవీఏ) పెంపు ద్వారా జిల్లా జిడిపి పెరిగి, తలసరి ఆదాయం వృద్ధి చెందుతుందన్నారు. అందుకే క్షేత్రస్థాయి సిబ్బం ది సాధారణ విధులకే పరిమితం కాకుండా, తమ పరిధి లోని వాస్తవ పరిస్థితులను పరిగణనలోకి తీసుకొని వివిధ రంగాల లోని ఉత్పత్తులకు అదనపు విలువ (జీవీఏ) జోడించేలా ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ చెప్పారు. ఈ దిశగా మెరుగైన ఫలితా లు రాబట్టేందుకే జిల్లా స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ ఆలోచనలు, (తరువాయి 4లో...)

## ఇనాం భూముల పట్టాలకు మోక్షం

**ఎమ్మెల్యే ఏలూరి చొరవతో వేగం పుంజుకున్న ప్రక్రియ**
**మంత్రి అనగాని ద్వారా సీఎస్ దృష్టికి**
**జూలై 8న క్యాబినెట్‌లో నిర్ణయం తీసుకునే అవకాశం**
**నాలుగు గ్రామాల్లో 3,067 మంది రైతులకు ఊరట**



(షణ్ముఖ వెలుగు, పర్చూరు, జూన్ 30)

దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న ఇనాం భూముల సమస్యకు పరిష్కారం దిశగా అడుగులు పడుతున్నాయి. పర్చూరు, మార్టూరు మండలాల పరిధిలోని నాలుగు గ్రామాల్లో రైతువారీ పట్టాల మంజూరు ప్రక్రియ వేగం పుంజుకుంది. ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు నిరంతర కృషి ఫలితంగా ఈ అంశం ప్రభుత్వ ఉన్నతస్థాయికి చేరింది. ఆయన విజ్ఞప్తి మేరకు రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ సమస్యను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దృష్టికి తీసుకెళ్ళి సత్వర పరిష్కారం కోరారు. ఇనాం భూముల అంశంపై ఎమ్మెల్యే ఏలూరి గతంలోనూ పలుమార్లు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి అనగాని సత్యప్రసాద్, సీసీఎల్ఏ కమిషనర్, జిల్లా కలెక్టర్ల దృష్టికి తీసుకెళ్లి రైతులకు పట్టాలు మంజూరు చేయాలని కోరిన విషయం తెలిసిందే. ఆయన కృషి ఫలితంగానే ప్రస్తుతం ప్రభుత్వం ఈ దిశగా చర్యలు వేగవంతం చేసినట్లు తెలుస్తోంది. పర్చూరు నియోజకవర్గంలోని మార్టూరు మండలం లక్కవరం, జంగమహేశ్వరపురం, పర్చూరు మండలం ఎడుబాడు, చెన్నుంబొట్ల అగ్రహారం గ్రామాల్లో 70-80 ఏళ్లుగా రైతులు ఇనాం, ఎస్టేట్ భూములను సాగు చేసుకుంటున్నా పట్టాలు లేక ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యే ఏలూరి రెవెన్యూ మంత్రికి వివరించారు. పట్టాదారు పాస్‌పుస్తకాలు లేకపోవడంతో సంక్షేమ, సబ్సిడీ పథకాల ప్రయోజనం అందడం లేదని, వెంటనే పట్టాల మంజూరుకు చర్యలు తీసుకోవాలని కోరారు. దీనికి కమిషనర్ (తరువాయి 4లో...)

## "ప్రకాశం యువ సాతి మిషన్"ను జిల్లాలో విజయవంతం చేయాలి

**జిల్లా కలెక్టర్ పి రాజాబాబు**



(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, జూన్ 30)

ప్రకాశం జిల్లా యువతకు బంగారు భవిష్యత్తు అందించడంతో పాటు సమాజంలో ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దే సంకల్పంతో ప్రారంభించుకున్న "ప్రకాశం యువ సాతి మిషన్ " కార్యక్రమాన్ని జిల్లాలో విజయవంతంగా అమలు చేయడంలో తమవంతు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ పి రాజాబాబు, విద్యా శాఖాధికారులకు సూచించారు. చదువుతో పాటు సమాజానికి ఉత్తమ పౌరులను అందించాలన్న లక్ష్యంతో రూపొందించిన " ప్రకాశం యువ సాతి మిషన్ " కార్యక్రమాన్ని మంగళవారం ఒంగోలు కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాల్లో జిల్లా కలెక్టర్ పి రాజాబాబు లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రకాశం జిల్లా యువతకు బంగారు భవిష్యత్తు అందించడంతో పాటు సమాజంలో ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దే సంకల్పంతో "ప్రకాశం యువ సాతి మిషన్" కార్యక్రమాన్ని ప్రారంభించుకోవడం జరిగిందన్నారు. 8వ నుండి 12వ తరగతి విద్యార్థులను లక్ష్యంగా నిర్దేశించుకుని, వీరికి ఉత్తమ విద్యా బోధనలు అందించడంతో పాటు 12వ తరగతి అయిన తరువాత ఉన్నత చదువుల కొరకు వెళ్లి నప్పుడు సమాజంలో ఏ సమస్య వచ్చిన దీటుగా ఎదుర్కొనేలా, అలాగే తమ హక్కులను సాధించుకునేలా వీరిని తీర్చిదిద్దడమే ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశ్యమని కలెక్టర్ తెలిపారు. నిరంతరం విద్యార్థులను ప్రోత్సహించేలా ఉపాధ్యాయులను గుర్తించి వారిని ఈ యువ సాతి మిషన్ కార్యక్రమంలో భాగస్వాములను చేయాలన్నారు. ఇటీవల వెలువడిన 10వ తరగతి పరీక్షా ఫలితాల్లో ప్రకాశం జిల్లా రాష్ట్రంలో 4వ స్థానం రావడంలోను, అలాగే సప్లమెంటరీ 10వ తరగతి పరీక్షల్లో మొదటి స్థానం రావడంలో కృషి చేసిన విద్యాశాఖాధికారులను ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా అభినందిస్తూ, విద్యార్థుల్లో విద్యా ప్రమాణాలు పెంపొందించడం, ఉత్తమ ఫలితాలు సాధించేలా విద్యాశాఖాధికారులు కృషి చేయాలన్నారు. నేడు రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ కార్పోరేట్ స్కూల్స్ కు దీటుగా ప్రభుత్వ పాటశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనతో పాటు విద్యా ప్రమాణాలు పెంపొందించేలా అన్ని చర్యలు తీసుకోవడం జరుగుచున్నదన్నారు. కావున విద్యాశాఖాధికారులు ప్రభుత్వ పాటశాలల్లో ఎన్రోల్మెంట్ శాతం పెరిగేలా తమవంతు కృషి చేయాలన్నారు. వెనుకబడిన ప్రకాశం జిల్లాలో 80 శాతం మేర గ్రామీణ ప్రాంత ప్రజలు ఉన్న నేపధ్యంలో విద్య ద్వారానే భివృద్ధి సాధ్యం అనే ఆలోచనను ప్రజల్లో కలిగేలా విద్యాశాఖాధికారులు పని చేయాల్సిన అవసరం ఉందన్నారు. (తరువాయి 4లో...)

## కాంస్య పతకం సాధించిన హోంగార్డు కుమారుడికి అభినందనలు

**జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్‌రాజు**

(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, జూన్ 30)

తెలంగాణ రాష్ట్రంలోని గచ్చిబౌలి స్టేడియంలో జూన్ 23 నుంచి 28 వరకు నిర్వహించిన 27వ సబ్ జూనియర్ ఈక్విప్డ్ నేషనల్ పవర్‌లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్ 2026 పోటీల్లో కాంస్య పతకం సాధించిన ప్రకాశం జిల్లా పోలీసు శాఖకు చెందిన హోంగార్డు జి భక్త ధ్రువుడు కుమారుడు జి శక్తీధర్ శ్రీ చంద్రను జిల్లా పోలీసు కార్యాలయంలో ఈ



# ఇనాం భూముల పట్టాలకు మోక్షం

సానుకూలంగా స్పందిస్తూ సమస్యను త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే సిఫారసుతో మంత్రి అనగాని సత్యప్రసాద్ ఈ అంశాన్ని సీఎస్ దృష్టికి తీసుకెళ్లడంతో, సీసీఎల్ఏ స్థాయిలో పెండింగ్‌లో ఉన్న ప్రతిపాదనలను వేగంగా పరిశీలించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రెవెన్యూ శాఖ వివరాల ప్రకారం పర్చూరు మండలం చెన్నుంబొట్ల అగ్రహారంలో 803.02 ఎకరాలపై 518 మంది, ఎడుబాడులో 1,104.75 ఎకరాలపై 630 మంది, మార్టూరు మండలం లక్కవరంలో 565.84 ఎకరాలపై 390 మంది, జంగమహేశ్వరపురంలో 2,465.27 ఎకరాలపై 1,529 మంది రైతులు ఆధారపడి జీవిస్తున్నారు. మొత్తం నాలుగు గ్రామాల్లో 4,938.88 ఎకరాల ఇనాం భూమిపై 3,067 మంది రైతుల భవితవ్యం ముడిపడి ఉంది. సర్వేలు, నోటిఫికేషన్లు, నివేదికల ప్రక్రియలు పూర్తయినప్పటికీ కొన్ని ప్రతిపాదనలు సీసీఎల్ఏ స్థాయిలో పెండింగ్‌లో ఉండటంతో పట్టాల మంజూరులో జాప్యం జరిగింది. ప్రస్తుతం సీఎస్ స్థాయిలోనూ సమీక్ష జరుగుతున్న నేపథ్యంలో ఈ నెల 8న జరగనున్న రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో ఇనాం భూముల అంశం పై కీలక నిర్ణయం వెలువడే అవకాశం ఉన్నట్లు సమాచారం. క్యాబినెట్ ఆమోదం లభిస్తే దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న వేలాది మంది రైతులకు త్వరలోనే పట్టాలు లభించే వీలుంటుందని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.

## జిల్లా రూపురేఖలు మారటంలో సిబ్బంది సేవలు అత్యంత కీలకం

నిబంధనలతో పాటు క్షేత్రస్థాయి వాస్తవ పరిస్థితులను పరిశీలించి ఉత్తమ ఫలితాలు రాబట్టేలా పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఓ సుధాకర్‌రెడ్డి, ఏఎస్ఓలు, మండల వ్యవసాయ, ఉద్యాన అధికారులు, డిప్యూటీ ఎంపీడీవోలు, నియోజకవర్గస్థాయి యంగ్ ప్రొఫెషనల్స్, వివిధ రాష్ట్రాలకు చెందిన రిసోర్స్ పర్సన్స్ పాల్గొన్నారు.

## కాంస్య పతకం సాధించిన హోంగార్డు కుమారుడికి అభినందనలు

జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్‌రాజు ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ కాంస్య పతకం సాధించడం ఎంతో గర్వకారణమని అన్నారు. భవిష్యత్తులో మరింత కృషి చేసి ఉన్నత స్థాయి పోటీల్లోనూ ప్రతిభ కనబరిచి జిల్లా, రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. క్రీడల్లో క్రమశిక్షణతో, పట్టుదలతో శ్రమిస్తే ఉన్నత విజయాలు సాధించవచ్చని తెలిపారు. క్రీడలతో పాటు విద్యలో రాణించాలని, కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు కూడ ఎంతో అవసరమని తెలిపారు.

## ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ వేగవంతం చేయాలి

**జిల్లా కలెక్టర్ పి రాజాబాబు**






**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 30)**

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియ వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ పి రాజాబాబు ఆదేశించారు. ప్రతి రెండు గంటలకు పురోగతిని తన దృష్టికి తీసుకురావాలని ఆయన చెప్పారు. కేంద్ర ఎన్నికల కమిషనర్లు మంగళవారం అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ‘ సర్ ’ పురోగతి పై సమీక్షించారు. ప్రకాశం భవనం నుంచి కలెక్టర్ హాజరయ్యారు. అనంతరం ఇదే కార్యక్రమంలో పాల్గొన్న డిఆర్ఓ, సంతనూతలపాడు ఈఆర్వో మాధురి, ఇతర ఈఆర్వోలు చంద్రశేఖర్ నాయుడు (ఒంగోలు), విజయ జ్యోతి (అద్దంకి), రవికుమార్ (కొండపి)లతో కలెక్టర్ ప్రత్యేకంగా చర్చించారు. ఎన్యూమరేషన్ పత్రాల పంపిణీ, డిజిటైజేషన్ ప్రగతిపై ఆరా తీశారు. సమాంతరంగా మ్యాపింగ్ పైనా దృష్టి పెట్టాలన్నారు. కొత్తగా నియమించిన ఏఈఆర్వోలు, బిఎల్వోలకు కూడా ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించి ‘ సర్ ’ పురోగతి పెరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

# “ప్రకాశం యువ సాతి మిషన్”ను జిల్లాలో విజయవంతం చేయాలి

బడిఈడు పిల్లలందరూ తప్పనిసరిగా బడిలోనే ఉండాలి అనే లక్ష్యంతో విద్యాశాఖాధికారులు పనిచేయాలన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభమైన నేపథ్యంలో ఇప్పటి నుండే 9, 10వ తరగతి విద్యార్థుల పై ప్రత్యేక దృష్టి సారించి, ముఖ్యంగా డల్ విద్యార్థులను గుర్తించి వారు ఏ సబ్జెక్ట్‌లో వెనుకబడి ఉన్నారో తెలుసుకొని వారికి ప్రత్యేక బోధన పద్ధతులు బోధించి ఉత్తమ ఫలితాలు సాధించేలా కృషి చేయాలన్నారు. మండల విద్యా శాఖాధికారులు స్కూల్స్ ను విజిట్ చేసిన సమయంలో కచ్చితంగా విద్యార్థులతో మాట్లాడాలని, అలా మాట్లాడినప్పుడే విద్యార్థుల సమస్యలను తెలుసుకునేందుకు వీలుంటుందన్నారు. చదువుతో పాటు ప్రతి విద్యార్థిలో నైపుణ్యాభివృద్ధి పెంపొందేలా విద్యా శాఖాధికారులు పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి విద్యార్థి తమ జీవితంలో ఉన్నత లక్ష్యాలను చేరుకునేలా “ప్రకాశం యువ సాతి మిషన్” కార్యక్రమం తోడ్పాటు అందించేలా ఈ కార్యక్రమాన్ని జిల్లా పటిష్టంగా అమలు చేయడంలో తమవంతు కృషి చేయాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, విద్యా శాఖాధికారులను కోరారు. ఈ సందర్భంగా “ప్రకాశం యువ సాతి మిషన్” కార్యక్రమం యొక్క ఉద్దేశ్యాన్ని, లక్ష్యాన్ని విద్యా శాఖాధికారులకు ప్రకాశం యువ సాతి మిషన్ నోడల్ అధికారి గిరిధర్ శర్మ వివరించారు. ప్రకాశం యువ సాతి మిషన్ కార్యక్రమం పై రూపొందించిన పాటను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పాటను రచించిన పొదిలి మండలం, రాములవీడు మండల ప్రజా పరిషత్ స్కూల్ ఉఫాద్యాయులు శివరాజు కామేశ్వరరావును, బుక్ ప్రేపరేషన్‌కుగాను పొదిలి మండలం, పార్వతీపురం మండల ప్రజా పరిషత్ ఉఫాద్యాయులు రాంగోపాల్‌రెడ్డి ని జిల్లా కలెక్టర్ శాలువాతో సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి రేణుక, సర్వశిక్ష ఎపిఓ అనీల్ కుమార్, సార్డ్స ప్రతినిధి సునీల్, జిల్లాలోని మండల విద్యాశాఖాధికారులు, తదితరులు పాల్గొన్నారు.






# మూడు జిల్లాలకు నీరు అందించనున్న త్యాగధనులు

**నాడు శంకుస్థాపనలో... నేడు పరిహారం అందించడంలో కీలకపాత్ర**

**గూడూరి ఎరిక్షన్ బాబు**

**కన్నుతల గ్రామంలో అంబరాన్నింటిన సంబరాలు**

**ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చిత్రపటానికి కలనూతల గ్రామస్తుల పాలాభిషేకం**




**(షణ్ముఖ వెలుగు, పెద్దారవీడు, జూన్ 30)**

పెద్దారవీడు మండలం, కలనూతల గ్రామంలో వెలిగొండ ప్రాజెక్టు ముంపు గ్రామాల నిర్వాసితులకు రూ.300 కోట్ల ఆర్ అండ్ ఆర్ పరిహారం విడుదల చేసిన సందర్భంగా యర్రగొండపాలెం నియోజకవర్గం టీడీపీ ఇంచార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చిత్రపటానికి గూడూరి ఎరిక్షన్‌బాబు, మహిళలు, కూటమి నాయకులు, నిర్వాసితులు, అభిమానులు ఘనంగా పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా యర్రగొండపాలెం నియోజకవర్గం టీడీపీ ఇంచార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు మాట్లాడుతూ వెలిగొండ ప్రాజెక్టు నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. ఇప్పటికే రూ.300 కోట్ల పరిహారాన్ని విడుదల చేసి నిర్వాసితుల పట్ల తమ చిత్తశుద్ధిని నిరూపించారు. మిగిలిన అర్హులైన లబ్ధిదారులకు కూడా వచ్చే జులై, ఆగస్టు నెలలలో మరో రూ.600 కోట్ల పరిహారం విడుదల చేసి, అందరికీ న్యాయం చేస్తామని ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇచ్చింది. ప్రతి నిర్వాసిత కుటుంబం ప్రభుత్వం కేటాయించిన స్థలంలో సొంత ఇంటిని నిర్మించుకుని గౌరవప్రదమైన జీవితం ప్రారంభించుకోవాలని కోరారు. వెలిగొండ ప్రాజెక్టు పనులు వేగంగా కొనసాగుతున్నాయని, త్వరలోనే ప్రాజెక్టులో నీటి విడుదల జరిగి లక్షల ఎకరాలకు సాగునీరు ప్రజలకు త్రాగు నీరు అందే చారిత్రాత్మక ఘట్టం ఆవిష్కృతమవుతుందని తెలిపారు. దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేసి రైతుల కలను సాకారం చేయడంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వం చారిత్రాత్మకమని, నిర్వాసితులకు ఇచ్చిన ప్రతి హామీని ప్రభుత్వం తప్పకుండా అమలు చేస్తుందని ఎరిక్షన్‌బాబు అన్నారు. ఈ కార్యక్రమంలో పెద్దారవీడు మండల కూటమి నాయకులు, కార్యకర్తలు, కలనూతల గ్రామ నిర్వాసితులు, మహిళలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల కన్వీనర్ గొట్టం శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీపీ చంద్రగుంట్ల నాగేశ్వరరావు, మాజీ సర్పంచ్ వెంకటేశ్వర్లు, నాయకులు నక్క శ్రీను, ప్రసాద్, ఎల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.





## ఆర్టీసీ ప్రయాణంలో విశ్రాంతి మలుపు ముగ్గురు సీనియర్ ఉద్యోగులకు ఆత్మీయ వీడ్కోలు



(షణ్ముఖ వెలుగు, పొదిలి, జూన్ 30)

సంస్థ ప్రగతి చక్రంలో భాగస్వామ్యులై, దశాబ్దాల పాటు ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చిన ముగ్గురు సీనియర్ ఉద్యోగులు విధి నిర్వహణ నుండి వైదొలిగారు. స్థానిక ఏపీఎస్ఆర్టీసీ డిపో గ్యారేజ్ ఆవరణలో ఏడీసీ ముల్లా షరీఫ్, డ్రైవర్లు డి ఎల్ నారాయణ, ఏ బాలయ్యల పదవీ విరమణ వేడుక మంగళవారం అత్యంత ఆత్మీయ వాతావరణంలో జరిగింది. ఒకవైపు బాధ్యతల నుండి విముక్తి లభించిందనే సంతోషం, మరోవైపు దశాబ్దాల పాటు కలిసి నడిచిన సహచరులను విడిచి వెళ్తున్నామనే భావోద్వేగాల మధ్య ఈ వీడ్కోలు సభ సాగింది. ఆర్టీసీ గ్యారేజ్ ఆవరణను పూలతో ముస్తాబు చేసి, రిటైర్డ్ ఉద్యోగులను సముచిత రీతిలో గౌరవించారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ వి. శంకర్రావు, అసిస్టెంట్ డీఎం రవణమ్మ, ఏఎంఎఫ్ బాబ్జిలు మాట్లాడుతూ ఉద్యోగ విరమణ అనేది ప్రతి ఒక్కరి జీవితంలో ఒక సహజమైన ప్రక్రియ. అయితే, సంస్థ గడ్డు కాలంలో ఉన్నప్పుడు కూడా క్రమశిక్షణతో, అంకితభావంతో పనిచేసి ఆర్టీసీని లాభాల బాటలో నడిపించిన ఇలాంటి ఉద్యోగుల సేవలు ఎల్లప్పుడూ స్మరణీయమైనవన్నారు. డ్రైవర్లు నారాయణ, బాలయ్యలు ఎలాంటి ప్రమాదాలకు తావులేకుండా ప్రయాణికులను చేరవేస్తే, ఏడీసీగా ముల్లా షరీఫ్ తన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని కొనియాడారు. కార్యక్రమంలో వివిధ కార్మిక సంఘాల నాయకులు, డిపో సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రసంగించారు. యాజమాన్యానికి, కార్మికులకు మధ్య వారధిగా ఉంటూ, సంస్థ అభివృద్ధికి తోడ్పడిన సీనియర్ల అనుభవం భవిష్యత్తు తరాలకు మార్గదర్శకమని పేర్కొన్నారు. అనంతరం పదవీ విరమణ పొందిన ముగ్గురు ఉద్యోగులను గజమాలలతో, శాలువాలతో ఘనంగా సత్కరించి వారి కుటుంబ సభ్యుల సమక్షంలో ఆత్మీయంగా సన్మానించారు. కార్యక్రమంలో డిపో కార్మికులు కార్యాలయ సిబ్బందితోపాటు స్థానిక నాయకులు పాల్గొని వారికి శుభాకాంక్షలు తెలియజేశారు.

## కేజీబీవీ హాస్టల్‌లో మైదుకూరు పోలీసుల మెరుపు తనిఖీ

### విద్యార్థినులకు సిఐ రమణారెడ్డి భరోసా





(షణ్ముఖ వెలుగు, మైదుకూరు, జూన్ 30)

వైఎస్ఆర్ కడప జిల్లాలో మహిళలు, విద్యార్థినుల భద్రతే ధ్యేయంగా జిల్లా పోలీస్ యంత్రాంగం కదిలింది. జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ కఠిన ఆదేశాల మేరకు మైదుకూరు పట్టణంలో పోలీసులు అలర్ట్ అయ్యారు. మైదుకూరు అర్బన్ సిఐ రమణారెడ్డి మంగళవారం సాయంత్రం స్థానిక కస్తూరిబా గాంధీ బాలికా విద్యాలయం గర్ల్స్ హాస్టల్‌ను ఆకస్మికంగా సందర్శించి, అక్కడ భద్రతా ప్రమాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా హాస్టల్ విద్యార్థినులతో సిఐ రమణారెడ్డి నేరుగా ముఖాముఖి మాట్లాడారు. వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకుంటూ "మీకు మేమున్నాం.. ధైర్యంగా ఉండండి" అంటూ భరోసా ఇచ్చారు. హాస్టల్‌లో ఉండే బాలికల భద్రత విషయంలో ఎలాంటి అజాగ్రత్త వహించినా సహించేది లేదని వార్డెన్‌కు స్పష్టం చేశారు. రక్షణ పరంగా తగిన జాగ్రత్తలు, సిసి కెమెరాల నిఘా, మరియు భద్రతా చర్యలు నిరంతరం కొనసాగాలని కఠిన సూచనలు చేశారు. బాలికల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించేందుకు ఈ క్రింది కీలక అంశాల పై ప్రత్యేక అవగాహన కల్పించారు. విపత్కర పరిస్థితుల్లో తమను తాము ఎలా కాపాడుకోవాలో వివరించారు. బాల్య వివాహాల నివారణ, మహిళా రక్షణ చట్టాల గురించి అవగాహన కల్పించారు. స్మార్ట్‌ఫోన్లలో 'శక్తి' యాప్ ప్రాముఖ్యతను, దాన్ని ఎలా ఉపయోగించాలో ప్రాక్టికల్‌గా చూపించారు. ఏ చిన్న సమస్య వచ్చినా తక్షణమే లిడయల్ 112 లేదా 1090 మహిళా హెల్ప్‌లైన్ నంబర్లకు కాల్ చేయాలని పిలుపునిచ్చారు. పోలీస్ శాఖ ఎల్లప్పుడూ మీ సేవలో ఉంటుంది. విద్యార్థినుల శ్రేయస్సే మా ప్రాధాన్యత అని సిఐ రమణారెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ విద్యార్థినులు, పాఠశాల సిబ్బంది, మైదుకూరు పట్టణ పోలీస్ సిబ్బంది భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# ఉద్యోగ విరమణ పొందిన సిబ్బందికి ఆత్మీయ వీడ్కోలు

### జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్‌రాజు

### సుదీర్ఘకాలం పాటు క్రమశిక్షణతో, బాధ్యతాయుతంగా విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ పొందడం అభినందనీయం

### ఉద్యోగ విరమణ అనంతరం కుటుంబ సభ్యులతో ఆనందంగా, ఆరోగ్యంగా గడపాలని ఆకాంక్షించిన జిల్లా ఎస్పీ



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 30)

పోలీసు శాఖలో సుదీర్ఘకాలం పాటు విశిష్ట సేవలందించి ఉద్యోగ విరమణ పొందిన ఐదుగురు ఎస్ఐలు, ఒక ఏఎస్ఐ, ఇద్దరు ఏఆర్ హెడ్ కానిస్టేబుళ్లు, ఒక కానిస్టేబుల్, ఒక డీపీఓ సిబ్బంది, ఒక హోం గార్డులను మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్‌రాజు శాలువాలు కప్పి, పుష్పగుచ్ఛాలతో సత్కరించి, వెండి జ్ఞాపికలను అందజేసి ఘనంగా సన్మానించి ఆత్మీయ వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ శాఖలో చేరినప్పటి నుండి నేటి వరకు ప్రజలకు సేవ చేస్తూ ఉద్యోగ విరమణ పొందడం అదృష్టమన్నారు. పోలీసు ఉద్యోగంలో కుటుంబానికి దూరంగా ఉంటూ ఎన్నో సవాళ్లను ఎదుర్కొని, నిబద్ధతతో, క్రమశిక్షణతో విధులు నిర్వర్తించిన వారి సేవలను జిల్లా పోలీసుశాఖ ఎప్పటికీ గుర్తుంచుకుంటుందని తెలిపారు. సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులు కీలక పాత్ర పోషిస్తున్నారన్నారు. 32 నుంచి 43 సంవత్సరాల పాటు పోలీసు శాఖకు విశిష్ట సేవలందించి గౌరవప్రదంగా ఉద్యోగ విరమణ పొందడం అభినందనీయమన్నారు. పోలీసు విధుల నిర్వహణలో ఎల్లప్పుడూ అండగా నిలిచి, సహాయ సహకారాలు అందించిన కుటుంబ సభ్యులకు జిల్లా పోలీసు శాఖ తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. వారి యొక్క సర్వీస్ లో రివార్డ్స్, సేవాపతకం, ఉత్తమ సేవాపతకం, గుడ్ సర్వీస్ పొందియున్నారు. సకాలంలో రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందేటట్లు అన్ని చర్యలు తీసుకుంటామని, వారి ఆరోగ్యం పట్ల జాగ్రత్త వహించాలని, మిగిలిన శేష జీవితాన్ని కుటుంబ సభ్యులతో ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో గడపాలని ఆకాంక్షినారు. పదవీ విరమణ తర్వాత కూడా మీరు పోలీసు కుటుంబంలో సభ్యులేనని, భవిష్యత్తులో వారికి ఏ సహాయం కావాలన్నా పోలీస్ శాఖ ఎల్లవేళలా వారికి తోడుగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అలాగే ఉద్యోగ విరమణ పొందిన సిబ్బంది యొక్క కుటుంబ వివరాలను, పిల్లల చదువుల, ఉద్యోగ స్థితిగతులను గురించి అడిగి తెలుసుకున్నారు. తల్లిదండ్రుల పట్ల ప్రేమ, గౌరవంతో వ్యవహరిస్తూ, వారి యోగక్షేమాలను జాగ్రత్తగా చూసుకోవాలని జిల్లా ఎస్పీ సూచించారు. ఉద్యోగ విరమణ పొందిన అధికారుల్లో పి వెంకటేశ్వర్లు, ఎ వి సుబ్బారావు, పి జనార్ధనరావు, ఎస్ కె మస్తాన్ షరీఫ్, బి అంకరాజు, పి వి ఎస్ నారాయణ మూర్తి, పి శ్రీనివాసులు, యు ఐసయ్య, బి కేశవ నారాయణ, సి హెచ్ భాగ్యలక్ష్మి, యు యాదలింగం ఉన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ సీతారామిరెడ్డి, ఆర్ ఎస్ఐ తిరుపతి స్వామి, బాషా, సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



# పలు దేవాలయాల్లో పూజలు నిర్వహించిన ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 30)

ఒంగోలు నగరంలోని కొత్తపట్నం బస్ స్టాండ్ శ్రీ రాజరాజేశ్వరి దేవస్థానం బ్రహ్మోత్సవాలు మంగళవారం వైభవంగా నిర్వహించారు. అదే విధంగా పాత సింగరాయకొండ నందు శ్రీలక్ష్మి నరసింహస్వామి వారి బ్రహోత్సవాలు, కామేపల్లి పోలేరమ్మ తల్లి బ్రహోత్సవాల సందర్భంగా ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే వెంట మార్కెట్ యార్డ్ చైర్మన్ రాచగర్ల వెంకట్రావు, బండారు మదన్, ఆలయాల చైర్మన్లు, డైరెక్టర్లు, తదితరులు పాల్గొన్నారు.










# విలువలు కలిగిన వ్యక్తి షరీఫా మాజీ ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు

(షణ్ముఖ వెలుగు, పొదిలి, జూన్ 30)

పొదిలి ఆర్టీసి డిపోలో సుమారు 35 సంవత్సరాల పాటు వివిధ సేవలు అందించిన ఏడిసి ముల్లా షరీఫా విలువలు కల్గిన వ్యక్తి అని గిద్దలూరు మాజీ ఎమ్మెల్యే, మార్కాపురం నియోజకవర్గ వైసీపీ ఇన్‌ఛార్జి అన్నా వెంకట రాంబాబు అన్నారు. మంగళవారం స్థానిక డిపో గ్యారేజీ ఆవరణలో ఆర్టీసిలో మంగళవారం ఉద్యోగ విరమణ చెందిన ఏడిసి ముల్లా షరీఫా, డ్రైవర్లు డిఎల్ నారాయణ, ఏ బాలయ్యల కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుదీర్ఘ కాలం పాటు ఎన్నో సేవలు అందించిన వీరిని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నానని తెలిపారు. వారి శేష జీవితం ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలతో పాటు సుఖ సంతోషాలతో కుటంబ సభ్యులతో కలిసి జీవించాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు సానికొమ్ము శ్రీనివాసరెడ్డి, గొలమారి చెన్నారెడ్డి, కల్లం వెంకట సుబ్బారెడ్డి, జి శ్రీను, మీడియా ప్రతినిధులు, రాజకీయాలకు అతీతంగా పట్టణంలోని పలువురు ప్రముఖులు వారినా శాలువాలతో సత్కరించి పూలమాలలు వేసి అభినందనలు తెలియజేశారు.





## ఎంపీడీవో పదవీ విరమణ కార్యక్రమంలో ఎమ్మెల్యే ముత్తుముల





(షణ్ముఖ వెలుగు, గిద్దలూరు, జూన్ 30)

గిద్దలూరు మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన మండల అభివృద్ధి అధికారి కె సీతారామారావు ఉద్యోగ విరమణ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కె సీతారామారావు, స్వర్ణలతని శాలువా, పూల మాలతో సత్కరించి, ఘనంగా సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ సేవలో ఎన్నో సంవత్సరాలు ప్రజలకు నిబద్ధతతో సేవలందించిన సీతారామారావు సేవలు ఆదర్శనీయమని కొనియాడారు. పదవీ విరమణ అనంతరం కూడా వారు ఆయురారోగ్యాలతో ఆనందంగా కుటుంబ సభ్యులతో కలిసి సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షిస్తూ వారికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ బైలడుగు బాలయ్య, జడ్పీటిసి బుడతా మధుసూదన్, మండల పార్టీ అధ్యక్షులు మార్తాల సుబ్బారెడ్డి, ప్రజా ప్రతినిధులు, అధికారులు, ఉద్యోగులు, మండల నాయకులు ఉద్యోగ విరమణ మహోత్సవంలో పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.

## జులై 2 నుంచి కడవకుదురులో 'ఒక నెల-ఒక గ్రామం'

### నాలుగు విడతల్లో రెవెన్యూ సమస్యల పరిష్కారం

(షణ్ముఖ వెలుగు, చిన్నగంజాం, జూన్ 30)

చిన్నగంజాం మండలం కడవకుదురు రెవెన్యూ గ్రామంలో జూలై 2నుంచి "ఒక నెల-ఒక గ్రామం-నాలుగు సందర్శనలు" కార్యక్రమం ఉదయం 10:30 గంటలకు తొలి విడత నిర్వహించనున్నట్లు మండల తహశీల్దార్ జె ప్రభాకరరావు తెలిపారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ సదరు కార్యక్రమంలో నాలుగు విడతల్లో గ్రామ ప్రజల నుండి వినతిపత్రాలు స్వీకరించి పెండింగ్ సమస్యలకు పరిష్కారం చూపించనున్నట్లు తెలిపారు. భూమి వివాదాలు, ఆర్ఓఆర్ సవరణలు, వెబ్‌ల్యాండ్ సమస్యలు వంటి రెవెన్యూ అంశాల పై గ్రామస్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని అయన సూచించారు.

# సమగ్ర ఓటర్ల సర్వేకు ప్రతి ఒక్కరు సహకరించాలి

## మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి








(షణ్ముఖ వెలుగు, పొదిలి పట్టణం, జూన్ 30)

మార్కాపురం ఎమ్మెల్యే కందులు నారాయణరెడ్డి పొదిలి పట్టణంలోని ఒకటి నుంచి 17 వార్డులలో తెలుగుదేశం పార్టీ నాయకులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సమగ్ర ఓటర్ల సర్వే కార్యక్రమానికి ప్రతి ఒక్కరు స్వచ్ఛందంగా వచ్చి సహకరించాలని, దానికి సంబంధించిన సంబంధిత పత్రాలు బిఎల్ఓలకు అందజేయాలన్నారు. ఎక్కడైనా దొంగ ఓట్లు ఉంటే వాటిని వేరు వేయడానికి బిఎల్వోలకు సహకారం అందించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా స్థానికులు కొన్ని సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని వారికి ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల, పట్టణ పార్టీ అధ్యక్షులు దోర్నాల అంజిరెడ్డి, ముల్లా ఖుద్దూస్, టిడిపి రాష్ట్ర కార్యదర్శులు గునుపూడి భాస్కర్, మీగడ ఓబుల్‌రెడ్డి, మెడికల్ కౌన్సిల్ మెంబర్ డాక్టర్ స్వర్ణ గీత, మర్రిపూడి ఎంపిపి వాకా వెంకటరెడ్డి, పొదిలి ఏఎంసి ఛైర్మన్ డాక్టర్ సయ్యద్ ఇమాంసా, టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వరికుంట్ల అనిల్, మాజీ వార్డు మెంబర్లు జ్యోతి మల్లిఖార్జున, మీగడ ఈశ్వర్‌రెడ్డి, పొదిలి మండల ప్రధాన కార్యదర్శి కాటూరి శ్రీను, పొదిలి పట్టణ తెలుగుయువత అధ్యక్షులు షేక్ కాలేషా, మాజీ శివాలయం కమిటీ ఛైర్మన్ సామంతపూడి నాగేశ్వరరావు, లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి ఎస్ ఎం భాష, దుగ్గెంపూడి శ్రీనివాసరెడ్డి (హనీమూన్), స్థానిక ఆయ అవార్డు తెలుగుదేశం నాయకులు, బిఎల్ఏలు, తదితరులు పాల్గొన్నారు.

# అంగన్వాడి కార్యకర్తల వృత్తికే ఆదర్శం

### పివి పార్వతి, లక్ష్మీరాజ్యం, బి మనోరంజితం
### సిడిపిఓ సరోజిని




(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, జూన్ 30)

అంగనవాడి కార్యకర్తలుగా అంకితభావంతో పనిచేసి వృత్తిని దైవంగా భావించి పలువురు చిన్నారులకు విద్యాబుద్ధులు నేర్పి పార్వతి, లక్ష్మీరాజ్యం, బి మనోరంగితం, అంగన్వాడీ కార్యకర్తలకే ఆదర్శవంతులు అని సిడిపిఓ సరోజిని కొనియాడారు. పామూరు పట్టణంలో తూర్పు వీధి, అంకాలమ్మ వీధిలలో అంగన్వాడి కార్యకర్తలుగా పని చేస్తున్న పార్వతి, లక్ష్మీరాజ్యం మంగళవారం ఉద్యోగ విరమణ చేస్తున్న సందర్భంగా ఉద్యోగ విరమణ అభినందన కనిగిరి సిడిపిఓ కార్యాలయం, పామూరు షాది ఖానాలో సన్మాన సభ కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిడిపిఓ సరోజిని, స్వయంకృషి సేవాసంస్థ అధ్యక్షులు డాక్టర్ షేక్ నాయబ్ రసూల్ లు మాట్లాడుతూ పార్వతి అంకితభావంతో పనిచేస్తూ సమయపాలన పాటించి సహచర కార్యకర్తలకు ఆదర్శంగా నిలిచిన ఉత్తమ కార్యకర్త అని అన్నారు. పార్వతి, లక్ష్మీరాజ్యం ను ఘనంగా సన్మానించి ఉద్యోగ విరమణ అభినందన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సన్మాన గ్రహీతలు పార్వతి, లక్ష్మీరాజ్యం ను సిడిపిఓ సరోజిని, అంగన్వాడి సూపర్వైజర్లు గోళ్ళ పద్మజ, దేవకృపావరం, ఎస్వియస్ పార్వతి, స్వయంకృషి సేవాసంస్థ అధ్యక్షులు డాక్టర్ షేక్ నాయబ్ రసూల్, తదితరులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సిడిపిఓ కార్యాలయ సిబ్బంది, అంగన్వాడి కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# మైదుకూరు అర్బన్ పోలీసుల ఆధ్వర్యంలో ప్రత్యేక గ్రామ సభ



(షణ్ముఖ వెలుగు, మైదుకూరు, జూన్ 30)

మైదుకూరు పట్టణ పరిధిలోని ఇందిరమ్మ కాలనీలో మంగళవారం సాయంత్రం మైదుకూరు అర్బన్ పోలీసుల ఆధ్వర్యంలో ప్రత్యేక గ్రామ సభ నిర్వహించారు. ప్రస్తుత సమాజంలో యువత, మహిళలు, సామాన్య ప్రజలు ఎదుర్కొంటున్న సైబర్ క్రైమ్స్, సోషల్ మీడియా అనర్థాలు, బాల్య వివాహాలు, వివిధ రకాల మోసాల పై మైదుకూరు అర్బన్ సిఐ రమణారెడ్డి ప్రజలకు క్షేత్రస్థాయిలో విస్తృత అవగాహన కల్పించారు. జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా ప్రతీ గ్రామంలోనూ 'విజిబుల్ పోలీసింగ్' వేగవంతంగా సాగుతోంది. పోలీసులు నేరుగా ప్రజల వద్దకే వెళ్లి ప్రస్తుత నేరాల పై చైతన్య పరచాలన్న ఎస్పీ పిలుపు మేరకు మైదుకూరు డిఎస్పీ జి రాజేంద్ర ప్రసాద్ పర్యవేక్షణలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ గ్రామ సభలో మైదుకూరు అర్బన్ సిఐ రమణారెడ్డి మాట్లాడుతూ శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పేకాట, గంజాయి రవాణా, అక్రమ మద్యం, నాటు సారా విక్రయాలు జరిపితే పోలీసు శాఖ పరంగా చట్టరీత్యా కఠినంగా శిక్షిస్తాం. నేరస్తులు, రౌడీ షీటర్ల కదలికలపై పోలీసు నిఘా నిరంతరం ఉంటుంది. గ్రామాల్లో గొడవలు సృష్టించాలని చూస్తే ఊపేక్షించేది లేదు. మహిళలు, చిన్నారులపై జరిగే నేరాలపై, భూతగాదాలపై తక్షణమే స్పందిస్తాం. సోషల్ మీడియాలో అభ్యంతరకర పోస్టులు పెట్టి ఇబ్బందుల్లో పడొద్దని యువతకు సూచించారు.

**పోలీసులకు సహకరించండి**
**మైదుకూరు అర్బన్ సిఐ రమణారెడ్డి**

నేరాల నియంత్రణ కేవలం పోలీసులతోనే సాధ్యం కాదని, ప్రజల సహకారం కూడా అంతే అవసరమని సి.ఐ పిలుపునిచ్చారు. 'గ్రామాల్లో ఎక్కడైనా సమస్యలు ఉన్నా, లేదా అపరిచిత వ్యక్తులు అనుమానాస్పదంగా తిరుగుతున్నా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలి. కాలనీ వాసులంతా ఐకమత్యంతో, కలిసిమెలిసి ఉండాలని మైదుకూరు అర్బన్ సిఐ రమణారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక పోలీస్ సిబ్బంది, ఇందిరమ్మ కాలనీ పెద్దలు, మహిళలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# చిన్నపాటి వర్షానికే కర్నూల్ రోడ్, బస్ స్టాండ్ సెంటర్ జలమయం

### రోడ్లపై కి కొట్టుకు వస్తున్న మురుగునీరు
### మంగళవారం మధ్యాహ్నం వరకు తగ్గని రోడ్లపై వర్షపు నీరు
### ఇబ్బందులు పడుతున్న వాహన చోధకులు, పాదచారులు
### డ్రైనేజీ బ్లాక్ అవడంతో నిలిచిన నీరు

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 30)

చిన్నపాటి వర్షానికే ఒంగోలు నగరం లోని బస్ స్టాండ్ సెంటర్, కర్నూల్ రోడ్ జలమయంగా మారుతుంది. దీంతో వాహనదారులకు, పాదచారులకు కష్టాలు తప్పడం లేదు. ఒంగోలులో సోమవారం రాత్రి తేలికపాటి వర్షం పడింది. దీంతో కర్నూల్ రోడ్డులోని ఆర్టీసీ బస్టాండ్ నుండి, అద్దంకి బస్టాండ్ వరకు వర్షం నీరు పోవడానికి వీలు లేక రోడ్లపైనే నిలిచిపోయింది. ఈ నీరు మంగళవారం మధ్యాహ్నం వరకు ఉండటంతో ప్రజలు నానా ఇబ్బందులు పడ్డారు.మునిసిపల్ సిబ్బంది నీరు పోయేందుకుచర్యలు తీసుకున్నారు,అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సిస్టంను వేగవంతం చేసి వర్షపు నీరు ఎప్పటికప్పుడు పోతురాజు







# స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ 2026 కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించిన కమిషనర్



(షణ్ముఖ వెలుగు, గిద్దలూరు, జూన్ 30)

భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ 2026 కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ కమిషనర్, సహాయక ఎన్నికల నమోదు అధికారి మంగళవారం మున్సిపాలిటీ పరిధిలోని పలు పోలింగ్ కేంద్రాలను, వార్డులను సందర్శించి కార్యక్రమ అమలును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా బూత్ స్థాయి అధికారులు ఇంటింటికీ వెళ్లి నిర్వహిస్తున్న ఎన్యూమరేషన్ ఫార్మ్స్ పంపిణీ, ఫార్మ్స్ సేకరణ, ఓటర్ల వివరాల నమోదు, ఆధార పత్రాల పరిశీలన, డేటా నమోదు మరియు డిజిటలైజేషన్ ప్రక్రియను ప్రత్యక్షంగా పరిశీలించారు. కార్యక్రమం ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగా జరుగుతున్న తీరును సమీక్షించి, అవసరమైన పలు సూచనలు చేశారు. ప్రతి ఓటరికి ఎన్యూమరేషన్ ఫారం అందేలా చర్యలు తీసుకోవాలని, ఏ కుటుంబం కూడా మిగిలిపోకుండా ఇంటింటికీ వెళ్లి వివరాలను సేకరించాలని దీూలకు ఆదేశించారు. ఫార్మ్స్ లో నమోదు చేసే వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి, ఎటువంటి తప్పిదాలు లేకుండా అత్యంత ఖచ్చితత్వంతో నమోదు చేయాలని సూచించారు. అదేవిధంగా, సేకరించిన ఫార్మ్స్ ను ఎప్పటికప్పుడు డిజిటలైజేషన్ చేసి, ఎన్నికల సంఘం రూపొందించిన ఆన్‌లైన్ వ్యవస్థలో సకాలంలో నమోదు చేయాలని తెలిపారు. డేటా నమోదు సమయంలో నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ, ప్రతి వివరాన్ని ఆధార పత్రాలతో సరిపోల్చి నమోదు చేయాలని సూచించారు. క్షేత్రస్థాయిలో ప్రజలకు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ 2026 కార్యక్రమం పై అవగాహన కల్పించి, దీూలు సందర్శించిన సమయంలో అవసరమైన సమాచారం, పత్రాలు అందజేసి పూర్తి సహకారం అందించాలని ప్రజలను కోరారు. ఓటరు జాబితా పారదర్శకంగా, ఖచ్చితంగా రూపొందించడం ఎన్నికల సంఘం ప్రధాన లక్ష్యమని, అందుకు ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ ఇవి రమణ బాబు మాట్లాడుతూ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ 2026 కార్యక్రమాన్ని అత్యంత ప్రాధాన్యతతో అమలు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొంటున్న ప్రతిదీ బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించి, ఎన్నికల సంఘం నిర్దేశించిన గడువులోపు ఎన్యూమరేషన్, డిజిటలైజేషన్ పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ తనిఖీలలో మున్సిపల్ కమిషనర్‌తో పాటు పట్టణ ప్రణాళికా అధికారి, ఎలెక్షన్ సూపర్వైజర్ పాల్గొన్నారు.

# పోలీస్ శాఖకు మీరు అందించిన సేవలు చిరస్మరణీయం

## జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్

## ఉద్యోగ విరమణ పొందిన 7 గురు పోలీస్ అధికారులకు ఘన వీడ్కోలు

## ఆరోగ్యం, కుటుంబం పై దృష్టి సారించాలని ఎస్పీ సూచన



**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, కడప, జూన్ 30)**
క్రమశిక్షణ, అంకితభావంతో నిర్విరామంగా ప్రజా సేవ అందించి పదవీ విరమణ పొందడం అభినందనీయమని వై.ఎస్.ఆర్ కడప జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ పేర్కొన్నారు. మంగళవారం పోలీస్ శాఖ నుండి ఉద్యోగ విరమణ పొందిన నలుగురు ఎస్ఐలు, ఒక ఆర్ఎస్ఐ, ఒక ఏఎస్ఐ, ఒక హెడ్ కానిస్టేబుల్‌కు జిల్లా పోలీస్ కార్యాలయంలోని పెన్నార్ పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో ఘనంగా సన్మాన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎస్పీ రిటైర్డ్ అధికారులకు జ్ఞాపికలు అందజేసి, ఆత్మీయ వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ విధి నిర్వహణ కాలంలో ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీస్ సిబ్బంది చేసిన కృషి ఎంతో గొప్పదన్నారు. అప్పటి పరిస్థితులను ధీటుగా ఎదుర్కొంటూ, కుటుంబాలకు దూరంగా ఉంటూ విధులు నిర్వహించడం సాధారణ విషయం కాదని కొనియాడారు. ఎన్ని ఇబ్బందులున్నా బాధ్యతాయుతంగా పనిచేసి శాఖ కీర్తి ప్రతిష్టలను పెంచారని గుర్తుచేశారు. ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొని విజయవంతంగా పదవీ విరమణ చేసిన వీరంతా.. ఇకపై తమ కుటుంబ సభ్యులతో సంతోషంగా గడుపుతూ, ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. పదవీ విరమణ తర్వాత కూడా మీరంతా పోలీస్ కుటుంబ సభ్యులేనని, ఏ సమస్య వచ్చినా నేరుగా తన్ను సంప్రదించవచ్చని ఎస్పీ భరోసా ఇచ్చారు. ఉద్యోగ విరమణ పొందిన వారిలో ఎంవిఎస్ సుబ్బన్న (ఎస్.ఐ, డి.ఎస్.బి, కడప), సి బాల అంకయ్యలి (ఎస్.ఐ, డి.ఎస్.బి, కడప), కె నాగరాజులి (ఎస్.ఐ, ట్రాఫిక్ పి.ఎస్, కడప), కె చూడామణి వర్మ (ఆర్.ఎస్.ఐ, డి.ఏ.ఆర్ కడప), ఎస్‌కెఎ బాషా (ఎస్ఐ, ప్రొద్దుటూరు త్రీ టౌన్), ఎం ఎన్ రెడ్డి (ఏ.ఎస్.ఐ, ముద్దనూరు పి.ఎస్), ఆర్ వీరారెడ్డి (హెచ్.సి, ప్రొద్దుటూరు త్రీ టౌన్ పి.ఎస్) ఉన్నారు. ఈ ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమంలో అదనపు ఎస్పీ (పరిపాలన) కె ప్రకాష్ బాబు, ఏఆర్ అదనపు ఎస్పి బి రమణయ్య, స్పెషల్ బ్రాంచ్ డి.ఎస్.పి ఎన్ సుధాకర్, ఏఆర్ డి.ఎస్.పీ పి నాగేశ్వరరావు, డి.పీ.ఓ ఏఓ జి సుజాత, సూపరింటెండెంట్ శ్రీనివాసులు నాయక్, పోలీస్ అధికారి సంఘం జిల్లా అధ్యక్షుడు దూలం సురేష్, ఈసి మెంబర్స్ రామస్వామిరాజు, ఏప్రిన్, ఆర్ఐలు సోమశేఖర్ నాయక్, టైటస్, ఆర్ఎస్ఐ వెంకటేశ్వర్లు, ఉద్యోగ విరమణ పొందిన అధికారుల కుటుంబ సభ్యులు, పోలీస్ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఘనంగా సిడిపిఓ ఎలిజిబెత్ రాణి ఉద్యోగ విరమణ








**(షణ్ముఖ వెలుగు, కొరిశపాడు, జూన్ 30)**
మండలంలోని ఐసిడిఎస్ కార్యాలయం నందు మంగళవారం సిడిపిఓ ఎలిజిబెత్ రాణి ఉద్యోగ విరమణ కార్యక్రమం అత్యంత ఆర్భాటంగా జరిగింది. సెక్టర్ పరిధిలో ఉన్న సూపర్వైజర్లు, అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు సిడిపిఓ ఎలిజిబెత్ రాణి దంపతులను శాలువాతో సత్కరించి, ఆమె సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎండిఓ రాజ్యలక్ష్మి పాల్గొని పూలమాలతో సిడిపివో దంపతులను సన్మానించారు. ఈ సందర్భంగా ఎండిఓ రాజ్యలక్ష్మి మాట్లాడుతూ సిడిపిఓ ఎలిజిబెత్ రాణి విధినిర్వహణలో అంకిత భావం తో పనిచేసి తక్కువ సమయంలో అందరికీ దగ్గరయ్యారని అన్నారు. మనసులో ఎలాంటి కల్మషం లేకుండా ప్రతి ఒక్కరిని ఆప్యాయంగా పలకరించే వారని చెప్పారు. అనంతరం పలువురు సూపర్వైజర్ల మాట్లాడుతూ ఎలిజిబెత్ రాణి పదవీ విరమణ బాధగా ఉన్నప్పటికీ, రిటైర్మెంట్ తర్వాత జీవితం సంతోషంగా గడుపుతారని అన్నారు. తమతో సఖ్యతగా ఉండి ఆమె పని పట్ల బాధ్యతగా పనిచేశారని వారు గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్లు, కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

# చినమాలకొండయ్యకు మాజీ మంత్రి సురేష్ నివాళి



**(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, జూన్ 30)**
మండలంలోని చెన్నిపాడు గ్రామానికి చెందిన ఎంపీపీ కొండాబత్తిన మాధవరావు తండ్రి చిన మాలకొండయ్య సోమవారం అనారోగ్యంతో మృతి చెందడంతో వైసీపీ పీఏసీ సభ్యులు, మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్, సీఈసీ సభ్యులు డాక్టర్ మాదాసి వెంకయ్య మంగళవారం ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. అనంతరం చినమాలకొండయ్య కుటుంబ సభ్యులను పరామర్శించి కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఆయన వెంట జెడ్పీటీసీ బెజవాడ వెంకటేశ్వర్లు, వైసీపీ జిల్లా కార్యాచరణ కార్యదర్శి కాటా మాధవరావు, నియోజకవర్గ ఐటీ వింగ్ అధ్యక్షుడు యర్రా రామకృష్ణ, నియోజకవర్గ ప్రచార కమిటీ అధ్యక్షుడు పల్నాటి వెంకటేశ్వరరెడ్డి, పార్టీ మండల ఉపాధ్యక్షుడు కాటా మల్లికార్జున, వెన్నపూస శ్రీనివాసులరెడ్డి, జ్యేష్ఠ వేణు, కాలే అయ్యన్న, ముట్లూరి మోజస్, దొన్నెముద్దల మాల్యాద్రి, గెంటెనపల్లి చంద్రశేఖర్, కోలా శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

# ముల్లా షరీఫ్‌కు ఉద్యోగ విరమణ శుభాకాంక్షలు



**(షణ్ముఖ వెలుగు, పొదిలి, జూన్ 30)**
గత నలభై సంవత్సరాల నుండి ఏపీఎస్ఆర్టీసీలో వివిధ క్యాడర్లలో ఉద్యోగం నిర్వహిస్తూ ప్రస్తుతం ఏడిసి కేడర్ లో పదవీ విరమణ చేస్తున్న ముల్లా షరీఫ్, ఇతర సిబ్బంది జాలయ్య, నారాయణలను ఉద్యోగ విరమణ సందర్భంగా ఉమ్మడి ప్రకాశం జిల్లా జన విజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యక్షులు దాసరి గురుస్వామి, పొదిలి ఏఎంసీ చైర్మన్ డాక్టర్ సయ్యద్ ఇమాంసాలు ఘనంగా సత్కరించి శు భాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా దాసరి గురుస్వామి, డాక్టర్ ఇమాం సాహెబ్ మాట్లాడుతూ ముల్లా షరీఫ్ 34 సంవత్సరాలు పొదిలి డిపోలో ఉద్యోగం నిర్వహించి తనదైనశైలిలో పొదిలి డిపో అభివృద్ధికి కృషి చేశారని అభినందించారు. జాలయ్య, నారాయణ కూడా తమ ఉద్యోగ బాధ్యతలను చక్కగా నిర్వహించారని అభినందించారు. ఉద్యోగ విరమణ అనంతరం సుఖ సంతోషాలతో హాయిగా గడపాలని ఆకాంక్షించారు.

# పౌర హక్కుల పై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలి



**(షణ్ముఖ వెలుగు, చిన్నగంజాం, జూన్ 30)**
పౌర హక్కులపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని మండల తహశీల్దార్ జె ప్రభాకరరావు అన్నారు. మంగళవారం మండలంలోని చింతగుపల్లె నందు తహశీల్దార్ ఆధ్వర్యంలో పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ పౌర హక్కులకు భంగం కలిగించే వారిపై చట్టపరమైన చర్యలు తప్పావని అన్నారు. కుల వివక్ష, అంటరానితనాన్ని నిర్మూలించాలని, అన్ని కులాలు, వర్గాల వారు సోదరభావంతో మెలగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ జె ప్రభాకరరావు, గ్రామస్తులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# జులై 2న మోటుపల్లిలో రైతులకు పాస్ పుస్తకాలు పంపిణీ

**(షణ్ముఖ వెలుగు, చిన్నగంజాం, జూన్ 30)**
జులై 2న మండలంలోని మోటుపల్లి సచివాలయ కార్యాలయం నందు గ్రామ రెవెన్యూ పరిధిలోని రైతులందరికీ రాజముద్ర తో కుడిన కొత్త పట్టాదారు పాసు పుస్తకాలు పంపిణీ నిర్వహించనున్నట్లు మండల తహశీల్దార్ జె ప్రభాకరరావు ఓ ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 10 గంటలకు గ్రామ రైతులందరికీ ఉచిత పాసు పుస్తకాలు పంపిణీ వుంటుందని రైతులు సద్వినియోగం చేసుకోవాలని అయిన కోరారు.

# నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

**(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, జూన్ 30)**
జులై 1వ తేదీ బుధవారం 33/11కేవీ మండల పరిధిలోని కరేడు, అలగాయపాలెం సబ్ స్టేషన్‌కు సంబంధించిన 33కేవీ భీమవరం ఫీడర్ మరమ్మతు నిమిత్తం కరేడు గ్రామపంచాయతీ, దాని పరిసర గ్రామాలైన అలాగాయపాలెం, వాకా, బట్టిపాలెం, ధర్మారెడ్డి సంఘం, మద్రిశెట్టి సంఘం, టెంకాయ చెట్టు పాలెం, రామకృష్ణాపురం, ఉప్పరపాలెం, ఆకుతోటి సంఘం, చిన్న పల్లిపాలెం, కొత్తపల్లి పాలెంకు విద్యుత్ సరఫరా ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిలిపివేయబడుతుందని ఏఈ సాయిబాబు ఓ ప్రకటనలో తెలిపారు. కావున వినియోగదారులు ఈ అంతరాయానికి సహకరించాలని ఆయన కోరారు.

# ఎస్సీ, ఎస్టీ కేసుల్లో ముద్దాయిలను అరెస్టు చేయాలి

## దర్శి డీఎస్పీని కోరిన దళిత హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షులు నీలం నాగేంద్రరావు, మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు దారా అంజయ్య

**(షణ్ముఖ వెలుగు, దర్శి, జూన్ 30)**
ఎస్సీ, ఎస్టీ కేసుల్లో అగ్రకుల దుండగులను అరెస్టు చేయాలని దళిత హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షులు నీలం నాగేంద్రరావు, మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు దారా అంజయ్య దర్శి డిఎస్పి బాలమురళీకృష్ణను డిమాండ్ చేశారు. మంగళవారం తాళ్లూరు మండలం శివరాంపురం గ్రామంలో బొగ్గుల శ్రీనివాసరెడ్డి కుటుంబ సభ్యులు ఆక్రమించుకున్న మాదిగల పట్టా భూమి స్థలాన్ని దళిత నాయకులు నీలం నాగేంద్ర తో కలిసి పరిశీలించారు. శివరాంపురం గ్రామ సర్వేనెంబర్ 83 /1లో రెండు ఎకరాల 8 సెంట్లు అనపర్తి సోదరులకి కలదు. అందులో ఒక్కొక్కరికి 52 సెంట్లు వాటాగా రాగా అనపర్తి ప్రభుదాస్ అనే అతను తనకు వచ్చిన వాటాను వాడపల్లి అంజయ్యకు అమ్మగా అతను వెన్నపూస ఆదిలక్ష్మికి అమ్మినాడు. వైయస్సార్ పార్టీకి చెందిన వెన్నపూస ఆదిలక్ష్మి హద్దులను తప్పుగా నమోదు చేయించి 2024లో బొగ్గుల సమరసింహారెడ్డి రిజిస్టర్ చేయించుకొని నకిలీ పత్రాలు ఫోర్జరీ సంతకాలు చేసుకొని రహదారి ప్రక్క గల 26 సెంట్లు స్థలాన్ని ఆక్రమించి అక్రమ కట్టడాలు కట్టాడు అని నాగేంద్ర అన్నారు . ఆ స్థలంలో కాటా మరియు డైరీ ఫామ్ కట్టారు. అడ్డుపడిన భూమి హక్కు దారులైన మాదిగలపై దౌర్జన్యకాండ కు పాల్పడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లయిన మాదిగల గోడు పట్టించుకోలేదు. మాదిగల పట్టా భూమిని రెడ్లు ఆక్రమించుకొని అక్రమ కట్టడాలు కట్టి అక్కుదారులను బెదిరిస్తున్న విషయమై దళిత హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షులు నీలం నాగేందర్రావు దృష్టికి వచ్చింది. అంతట దర్శి డిఎస్పి బాలమురళి కృష్ణకు ఫోను చేసి మాదిగల భూమి ఆక్రమించిన రెడ్ల ముఠాపై ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేయాలని ఫిర్యాదు చేశారు. అంతట ఈ నెల 17వ తేదీన క్రైమ్ నెంబర్ 44 /26 ఎస్సీ ఎస్టీ కేసుగా తాళ్లూరు పోలీస్ స్టేషన్లో కేసు నమోదయింది. మంగళవారం బొగ్గుల శ్రీనివాసరెడ్డి అక్రమంగా ఆక్రమించుకొని అగ్రకుల కండ కావరంతో అక్రమ కట్టడాలు నిర్మించిన మాదిగల స్థలాన్ని సమక్షంలో బాధితుల సమక్షంలో నీలం నాగేంద్రరావు తో పాటు ధార అంజయ్య పరిశీలించారు. మాదిగల భూమి ఆక్రమించిన బొగ్గుల శ్రీనివాస్ రెడ్డి కుటుంబ సభ్యులను ల్యాండ్ గ్రాఫింగ్ క్రింద అరెస్టు చేసి జైలుకు పంపాలని నీలం నాగేంద్ర డిమాండ్ చేశారు. మాల మహానాడు అధ్యక్షుడు దారా అంజయ్య మాట్లాడుతూ ఇటలాపురంలో గ్రామంలో యానాదుల భూమి ఆక్రమించుకున్న కురిచేడు శ్రీను కుటుంబ సభ్యులను ఎస్సీ ఎస్టీ కేసుల్లో అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే మేదరమెట్ల పోలీస్ స్టేషన్లో నమోదైన బాపట్ల భువనేశ్వరి అను యానాది కులానికి చెందిన యువతి పట్ల అసభ్యంగా ప్రవర్తించి అవమానించిన అజయ్ అను కామాంధుడుని కూడా ఎస్సీ ఎస్టీ కేసులో అరెస్టు చేయాలని దర్శి డీఎస్పీ బాలమురళీకృష్ణను మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు దారా అంజయ్య కోరారు.






## రాళ్లపల్లి గ్రామంలో 'సర్' కార్యక్రమం



(షణ్ముఖ వెలుగు, వెలిగండ్ల, జూన్ 30)

ఒంగోలు పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆదేశాల మేరకు మండలంలోని రాళ్లపల్లి గ్రామం ఎస్సీ కాలనీలో సర్ కార్యక్రమం నిర్వహించారు. అందులో భాగంగా బీఎల్వో, బీఎల్ఏలకు త్వరగా పూర్తి చేయాలని ఉమ్మడి ప్రకాశం జిల్లా డిసిఎంఎస్ ఛైర్మన్ శ్యామల కాశిరెడ్డి తగు సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కేలం ఇంద్రభూపాల్‌రెడ్డి, మాజీ డిసిఎంఎస్ ఛైర్మన్ బీరం వెంకటేశ్వరరెడ్డి, మండల క్లస్టర్ ఇంచార్జ్ మీనిగ కాశయ్య, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## సర్వేను అత్యంత సమర్థంగా పారదర్శకంగా పూర్తి చేయాలి



(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, కడప, జూన్ 30)

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ నవీకరణపై క్షేత్రస్థాయిలో చేపట్టిన సర్వేను అత్యంత సమర్థంగా, పారదర్శకంగా పూర్తి చేయాలని భారత ఎన్నికల సంఘం డిప్యూటీ ఎన్నికల



కమిషనర్ పవన్ కుమార్ శర్మ స్పష్టం చేశారు. మంగళవారం ఢిల్లీ నుంచి భారత ఎన్నికల సంఘం రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లతో వర్చువల్ విధానంలో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించింది. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో వైఎస్ఆర్ కడప జిల్లా ప్రత్యేక అధికారి, ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ జాయింట్ సెక్రటరీ టిఎస్ చేతన్, జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి, డిఆర్ఓ మల్లికార్జునుడు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు. నాణ్యతతో కూడిన సర్వే జరగాలని పవన్ కుమార్ శర్మ తెలిపారు. ఈ సందర్భంగా డిప్యూటీ ఎన్నికల కమిషనర్ మాట్లాడుతూ ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించేందుకు ఇంటింటి ఓటర్ల సర్వేను వేగవంతం చేయాలన్నారు. బూత్ లెవెల్ అధికారులు క్షేత్రస్థాయిలో బాధ్యతాయుతంగా పనిచేయాలని, ఓటర్ల మ్యాపింగ్‌లో ఎలాంటి తప్పులు దొర్లకుండా, సాంకేతిక సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పలు కీలక సూచనలు చేశారు.

**కడప జిల్లాలో శరవేగంగా ప్రక్రియ**
**కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి**

సమీక్షలో జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి మాట్లాడుతూ వైఎస్ఆర్ కడప జిల్లాలో ఓటర్ల సవరణ ప్రక్రియ శరవేగంగా సాగుతోందని డిప్యూటీ ఎన్నికల కమిషనర్‌కు వివరించారు. జిల్లాకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. జిల్లాలో మొత్తం 18,96,23 మంది ఓటర్లు ఉన్నారు. సిబ్బంది క్షేత్రస్థాయి పరిశీలన కోసం 2,252 మంది బీఎల్ఓలు విధులు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే 97.67 శాతం ఫారాల పంపిణీ ప్రక్రియ విజయవంతంగా పూర్తయింది. పంపిణీ అయిన వివరాలను ఆన్‌లైన్ చేసే ప్రక్రియలో భాగంగా 21.53 శాతం డిజిటలైజేషన్ పూర్తయిందని, మిగిలిన పనిని కూడా త్వరలోనే పూర్తి చేస్తామని కలెక్టర్ వివరించారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లా యంత్రాంగం అంతా సమన్వయంతో పనిచేస్తూ, ఎలాంటి లోపాలు లేని ఓటర్ల జాబితాను రూపొందిస్తామని ఈ సందర్భంగా అధికారులు ధీమా వ్యక్తం చేశారు.

# ప్రజా సమస్యల పరిష్కార వేదిక

## ఒక నియోజకవర్గం, ఒక నెల, నాలుగు పర్యటనలు కార్యక్రమం

(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, కడప, జూన్ 30)




ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రజలకు మరింత చేరువగా పరిపాలనను అందించాలనే లక్ష్యంతో చేపట్టిన "ప్రజా సమస్యల పరిష్కార వేదిక, ఒక నియోజకవర్గం, ఒక నెల, నాలుగు పర్యటనలు" కార్యక్రమం మంగళవారం బద్వేల్ నియోజకవర్గంలో నిర్వహించబడింది. కడప జిల్లా జాయింట్ కలెక్టర్ నిధి మీనా ఆధ్వర్యంలో బద్వేల్ పట్టణంలోని శ్రీ రాఘవేంద్ర గ్రాండ్ నందు ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రజల నుంచి నేరుగా వినతులు స్వీకరించి, వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో బద్వేల్ డివిజన్ ఆర్డీవో ఏ చంద్రమోహన్, డీసీసీబీ బ్యాంక్ చైర్మ మంచూరు సూర్యనారాయణ రెడ్డి, వివిధ శాఖల జిల్లా స్థాయి, డివిజనల్ స్థాయి, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు. మొత్తం 87 మంది అర్జీదారులు తమ సమస్యల పరిష్కారం కోసం వినతిపత్రాలను కలెక్టర్, సంబంధిత శాఖల అధికారులకు సమర్పించారు. అందిన ప్రతి వినతిని క్షుణ్ణంగా పరిశీలించి, నిర్దేశిత గడువులో పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఇప్పటివరకు గత మూడు పర్యటనలో బద్వేల్ నియోజకవర్గంలో నిర్వహించిన పిజిఆర్ఎస్ వన్ మంత్ వన్ కాన్స్టెన్సీ



యందు మొత్తం 672 అర్జీలను స్వీకరించగా ఇప్పటికే 65 అర్జీలకు పరిష్కారం చూపించారు. మిగతా ఆర్జీలు ఇన్ ప్రోగ్రెస్‌లో ఉన్నాయని ఆర్డిఓ చంద్రమోహన్ తెలియజేశారు. ఈ కార్యక్రమం బద్వేల్ డివిజన్ ఆర్డీవో ఏ చంద్రమోహన్ అధ్యక్షతన విజయవంతంగా నిర్వహించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తూ ఇలాంటి కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తుందని అధికారులు తెలిపారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేసిన ఎరిక్షన్ బాబు



(షణ్ముఖ వెలుగు, యర్రగొండపాలెం, జూన్ 30)

యర్రగొండపాలెం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో 29 మంది లబ్ధిదారులకు రూ.36,93,032 విలువైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను మంగళవారం టిడిపి ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు పంపిణీ చేశారు. వివిధ ఆరోగ్య సమస్యలతో ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందిన బాధితులు చికిత్సకు సంబంధించిన వివరాలను సమర్పించి ఆర్థిక సహాయం కోరగా, సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా వారికి ఆర్థిక సహాయం అందేలా చర్యలు తీసుకున్నారు. ఈ మేరకు 29 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.36,93,032 విలువైన చెక్కులు అందజేశారు. చెక్కులు అందుకున్న లబ్ధిదారులు తమకు అందిన సహాయం పై సంతోషం వ్యక్తం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం మరియు సహకరించిన యర్రగొండపాలెం తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ గూడూరు ఎరిక్షన్ బాబుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ చేకూరి సుబ్బయ్య, ఎర్రగొండపాలెం మండల పార్టీ అధ్యక్షుడు చిట్యాల వెంగల్‌రెడ్డి, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు రెంటపల్లి సుబ్బారెడ్డి, షేక్ ఇస్మాయిల్, మస్తాన్ వలి, దేవినేని చలమయ్య, తోట మహేష్ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.




## ఎన్యూమరేషన్ ప్రక్రియలో నిర్లక్ష్యం వీడి పనిచేయండి

### జిల్లా కలెక్టర్ ఎం విజయసునీత



(షణ్ముఖ వెలుగు, త్రిపురాంతకం, జూన్ 30)

స్పెషల్ ఇన్సెంటివ్ రివిజన్ (సర్) కార్యక్రమం లో భాగంగా జరుగుతున్న ఎన్యూమరేషన్ ప్రక్రియలో సిబ్బంది నిర్లక్ష్యం వీడి పని చేయాలని జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత హెచ్చరించారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో సర్ కార్యక్రమం పై నియోజకవర్గస్థాయిలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్యూమరేషన్ డిజిటలైజేషన్ ప్రక్రియను ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారని బిఎల్వోలను తీవ్రంగా హెచ్చరించారు. సమయం లేనందున ఈ ప్రక్రియను త్వరిత గతిన పూర్తి చేయాలని ఆదేశించారు. నియోజకవర్గంలోని 5 మండలాల వారీగా డేటాను పరిశీలిస్తూ సక్రమంగా చేయని వారిని మందలించారు. ఇప్పటికైనా పద్ధతి మార్చుకొని ఈ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు. సర్ కార్యక్రమంలో జిల్లాను ముందు వరుసలో నిలిపేందుకు సిబ్బంది పని చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని వారికి కలెక్టర్ వివరించారు. ఈ కార్యక్రమంలో మార్కాపురం ఆర్డీవో ఎం వెంకట శివరామిరెడ్డి, ఎస్‌డీసీ సత్యనారాయణ, నియోజకవర్గంలోని అన్ని మండలాలు తహసిల్దార్లు పాల్గొన్నారు.

## కస్టమర్ల నమ్మకం పొందటమే ముఖ్యం




### ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

### సూర్య బార్, రెస్టారెంట్ పాతికేళ్ల వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

(షణ్ముఖ వెలుగు, కందుకూరు, జూన్ 30)

కందుకూరు పట్టణంలో సూర్య బార్ అండ్ రెస్టారెంట్ స్థాపించి 25 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా మంగళవారం వేడుకలు నిర్వహించారు. రెస్టారెంట్ నిర్వాహకులు, పట్టణ టిడిపి మాజీ అధ్యక్షులు పిడికిటి వెంకటేశ్వర్లు ఆహ్వానంతో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా కేక్ కట్ చేశారు. పాతికేళ్లుగా నాణ్యత, శుభ్రతను పాటిస్తూ, సూర్య రెస్టారెంట్ అనేకమంది నమ్మకాన్ని పొందిందని ఎమ్మెల్యే నాగేశ్వరరావు అన్నారు. ఇన్ని సంవత్సరాలపాటు ఒకే వ్యాపారాన్ని విజయవంతంగా నిర్వహించడం గొప్ప విషయం అన్నారు. సిల్వర్ జూబ్లీ వేడుకలు జరుపుకుంటున్న సందర్భంగా, నిర్వాహకులు పిడికిటి వెంకటేశ్వర్లు, సిబ్బందికి ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే చేతుల మీదుగా రెస్టారెంట్ సిబ్బందికి కొత్త బట్టలు అందించారు. అనంతరం నిర్వాహకులు ఎమ్మెల్యే నాగేశ్వరరావుని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో డిఎస్పి బాలసుబ్రమణ్యం, పట్టణ టిడిపి అధ్యక్షులు దామా మల్లేశ్వరరావు, నెల్లూరు పార్లమెంట్ ఉపాధ్యక్షులు ఉన్నం వీరాస్వామి, నియోజకవర్గ బిజెపి అధ్యక్షుడు ఘట్టమనేని హరిబాబు, వేముల సుకుమార్, పలువురు టిడిపి నాయకులు, వివిధ వర్గాల ప్రజలు వేడుకల్లో పాల్గొన్నారు.






On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com